# శ్రీరామ విగ్రహ నిర్మాణ శంకుస్థాపన

**రాఘవేంద్ర మఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో కార్యక్రమం**

**వర్చువల్‌గా ప్రారంభించనున్న కేంద్రం హోంశాఖ మంత్రి అమిత్ షా**



**కర్నూలు, జూలై 22, ప్రభాతవార్త** : హిందూ దేశంలో శ్రీరాముని ఘన చరిత్ర తెలియని వారు లేరు. శ్రీరామ ఘన చరిత్ర దేశవ్యాప్తంగా ఎక్కడికక్కడ ప్రజలకు ప్రస్ఫుటమయ్యేలా రామయ్య తండ్రి ఆలయాలు పనిచేస్తున్నాయి. అదే కోవలో ప్రస్తుతం అయోధ్యలో రామాలయం రంగ రంగ వైభవంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ తరుణంలో కర్నూలు జిల్లాలోనూ అయోధ్య రాముడు ప్రత్యేకత చాటి చెప్పే విధంగా 108 అడుగుల పంచలోహ విగ్రహాన్ని నిర్మిస్తున్నారు. మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థుల వారి ఆశీస్సులతో... వారి ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్న అయోధ్య రామయ్య విగ్రహ ఏర్పాటు దేశవ్యాప్తంగా ప్రత్యేకత సంతరించుకుంది. కర్నూలు జిల్లా మంత్రాలయం వద్ద 108 అడుగుల శ్రీరాముని పంచలోహ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం మరియు జైశ్రీరామ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుంది. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఢిల్లీ నుంచి కేంద్ర హోంశాఖ మాత్యులు అమిత్ షా వర్చువల్ విధానంలో విగ్రహ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరవుతున్నారు. జైశ్రీరామ్ ఫౌండేషన్ నిర్వాహకులు శ్రీధర్ ఎంపీ, కే రాము పనులను పర్యవేక్షిస్తున్నారు. శ్రీరాముని విగ్రహం ఏర్పాటు అయితే మంత్రాలయంకు మరింత ఆధ్యాత్మిక శోభ వస్తుందటంలో సందేహం లేదు. ఇప్పటికే మంత్రాలయం అంటే రాఘవేంద్రుని సన్నిధి అన్న పేరు ఉంది. అలాంటి ఆధ్యాత్మిక కేంద్రంలో శ్రీరాముని దివ్య మంగళ స్వరూపాన్ని పంచలోహంతో ఏర్పాటు చేయడం మరింత ఘన కీర్తిని సంతరించుకుంటుందని నిర్వాహకులు స్థానికులు చెబుతున్నారు.

## కేడీసీసీ బ్యాంక్ చైర్ పర్సన్‌గా ఎస్‌వి విజయ మనోహరి

**బాధ్యతలు స్వీకరణతో బ్యాంక్ వర్గాలలో ఆనందం**



**కర్నూలు, జూలై 22, ప్రభాత వార్త** : కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ పర్సనల్ ఇన్చార్జి కమిటీ చైర్ పర్సన్‌గా ఎస్‌వి విజయ మనోహరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బ్యాంకు సీఈవో రామాంజనేయులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. పాలనలో బ్యాంక్ వర్గాలు పూర్తిస్థాయిలో సహకారం అందించి బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా విజయ మనోహరి మాట్లాడుతూ కేడిసిసి బ్యాంక్ మరింత అభివృద్ధి చెందేలా కృషి చేస్తానన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు బలోపేతం చేస్తామన్నారు. రైతుల పరపతి అవసరాలు తీర్చేందుకు పాలకవర్గం పట్టుదలతో కృషి చేసేలా ముందుకు సాగుతామన్నారు. ఆమె బాధ్యతలు స్వీకరించడంతో వైసిపి పార్టీ శ్రేణులు, ఎస్వీ మోహన్ రెడ్డి వర్గం లోని పలువురు, బ్యాంక్ సిబ్బంది, రైతులు, స్థానికులు హర్షం వెలిబుచ్చారు.

# స్త్రీనిధిలో..అన్ని చిక్కులే..!

- పొదుపు సంఘాలపై విబికెల పెత్తనం..
- లోను ముగించే లోపు కిరికిరి..
- చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్న సిసిలు,పైస్థాయి అధికారులు



**ఆదోని రూరల్,జూలై 22,ప్రభాతవార్త** : పట్టణ,గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు స్వయం సంఘాల గ్రూపులుగా ఏర్పడి పొదుపు సంఘాలను ఏర్పాటు చేసుకుంటారు. మహిళలు ప్రతి నెలా డబ్బు చెల్లించుకుని పొదుపు చేసుకుంటారు. ఈ మహిళా సంఘాల గ్రూపులకు బ్యాంకులు రుణాలను ఇవ్వడం జరుగుతుంది. ఈ రుణాలను దశలవారిగా నెలనెలా చెల్లిస్తారు. అయితే ఇలాగే గ్రామాల్లో పొదుపు సంఘాలన్నీ కలిసి గ్రామ ఐక్య సంఘాన్ని ఏర్పాటు చేసుకుంటాయి. అలాగే మండల స్థాయిలో మహిళా మండల సమాఖ్య ఏర్పడుతుంది. మండల సమాఖ్య నుంచి కొన్ని గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులు స్త్రీనిధి ద్వారా రుణాలను తీసుకోవడం జరుగుతుంది. ఈ రుణాలను కూడా దశలవారిగా నెలనెలా వారు తీసుకున్న సొమ్మును చెల్లించడం జరుగుతుంది. వీరు తీసుకున్న రుణం డబ్బులను గ్రూపు సభ్యులు స్వయంగా వచ్చి బ్యాంకులో ఐక్యసంఘం ఖాతాకు జమచేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత వారు జమచేసిన రిసిప్టును సిసి ద్వారా రికార్డులో ఎంట్రీ చేయాల్సి ఉంటుంది. కానీ కొన్ని గ్రామాల్లో గ్రూపు సభ్యులు వెళ్లకుండ విబికెలు మేమే చెల్లిస్తామంటూ గ్రూపు సభ్యుల ద్వారా డబ్బులు మొత్తం తీసుకుని బ్యాంకు ఖాతాలో జమచేయకుండ గోల్‌మాల్ చేసిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఆదోని నియోజకవర్గంలో గతంలో పెద్దహరివాణం గ్రామంలో రూ.లక్షల్లో స్త్రీనిధి డబ్బులను ఖాతాలో జమచేయకుండ గోల్‌మాల్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అదేకోణంలో పెద్దతుంబళం గ్రామంలో కూడా అవినీతి జరిగిందంటూ ఆ గ్రామ మహిళా సంఘం సభ్యులు కూడా మండల స్థాయి అధికారుల దృష్టికి తెచ్చినా ఆ సిసిలపై ఎలాంటి దర్యాప్తు చేయకుండ చర్యలు కూడా తీసుకోలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలో రూ.లక్షల్లో స్త్రీనిధి డబ్బులను ఐక్యసంఘాల ఖాతాకు జమచేయకుండ గ్రామ మహిళా సంఘాలపై విబికెలు పెత్తనం చెలాయిస్తూ రూ.2లక్షలు గోల్‌మాల్ చేస్తుంటే మండల స్థాయి అధికారి మాత్రం అలాంటి వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ స్థాయిలో లెక్కలు గోల్‌మాల్ జరుగుతున్నాయంటే పైస్థాయి అధికారుల చేతివాటం కూడా ఉండా అనే అనుమానాలకు దారితీస్తుంది. ఇలా జరగటం వల్ల మహిళా సంఘాల సభ్యులు స్త్రీనిధులు అన్నీ చిక్కులేనని తల పట్టుకుంటున్నారు. ఏదేమైనా జిల్లా స్థాయి అధికారులు చొరవ చూపి అలాంటి విబికెలు,సిసిలపై చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

## డిఇఓపై ఎమ్మెల్యే ఆగ్రహం

- నంద్యాల జిల్లాలోని స్కూల్స్ అన్ని మూసివేయాలా?
- ఫోను కూడ ఎత్తి మాట్లాడే పరిస్థితి లేదా అంటూ ఉగ్రరూపం



**నంద్యాల విద్య, జూలై 22, ప్రభాతవార్త:** నీవు ఏమైనా ఎంపీవా, ఎమ్మెల్యేవా నీ ఇష్టానుసారంగా ఎందుకు వ్యవహరిస్తున్నావ్, మేము ఎమ్మెల్యేలమనుకుంటున్నావా? లేక మరేమనుకుంటున్నావ్ అంటూ బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కర్నూలు జిల్లా విద్యాశాఖాధికారి వి రంగారెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లా అయినంత మాత్రాన నీ ఇష్టానుసారంగా వ్యవహరిస్తావా నీపై అసెంబ్లీలో ప్రివిలైజేషన్ కమిటీ ముందు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో జిలా పరిషత్ సర్వసభ్యసమావేశం శనివారం జరిగింది. అందులో గంటన్నరసేపు విద్యాశాఖపై చర్చ జరిగింది. ఉమ్మడి కర్నూలు జిల్లా కావడంతో బదిలీలు, పదోన్నతులు, డిప్యూటేషన్లు అన్ని కూడ నంద్యాల జిల్లాలోని ఉపాధ్యాయుల వివరాలు కూడ తీసుకొని కర్నూలు జిల్లా విద్యాశాఖాధికారి బదిలీలు చేపట్టారు. బదిలీల్లో భాగంగా నిబంధనలకు విరుద్ధంగా నంద్యాల జిల్లాలోని ఎక్కువశాతం ఉపాధ్యాయ పోస్టులను బ్లాక్ లిస్టులో పెట్టి బదిలీలు,పదోన్నతులు చేపట్టారు. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా విద్యాశాఖాధికారి పెడచెవినపెట్టారని అరోపణలు వినిపిస్తున్నాయి. ఉపాధ్యాయులు లేక పాఠశాలలు మూతవేయాలా డిఇఓగా నీ బాధ్యత ఇదేనా విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలల ముందు ధర్నా చేసే పరిస్థితికి కారణమయ్యావంటూ డిఇఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనల మేరకు వ్యవహరించాల్సిన అధికారి ఇష్టారాజ్యంగా వ్యవహరించడంపై మిగతా ఎమ్మెల్యేలు కూడ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉన్న 14 మంది ఎమ్మెల్యేలు ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎత్తకపోవడంలోని అంతర్యమేమిటని ఇంత నిర్లక్ష్యదోరణి ఎందుకు కనబరుస్తున్నారంటూ మిగతా ఎమ్మెల్యేలు, జడ్పీటిసిలు నీ వ్యవహారశైలీ మార్చుకోవాలంటూ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు నేడు కింద కోట్లాది రూపాయలు ఖర్చుచేస్తు పాఠశాలల అభివృద్ధికి కృషిచేస్తుంటే నీవు నంద్యాల జిల్లాలోని ఉపాధ్యాయులందరిని ఆధోని, ఆలూరు, అస్పరి, చిప్పగిరి, హోలగుంద వంటి సుదూర ప్రాంతాలకు ఎందుకు బదిలీలు చేస్తున్నారు, పదోన్నతులు ఇస్తున్నారంటూ ప్రశ్నించారు. నంద్యాల జిల్లాలోని ఉన్న పోస్టులన్నింటిని మూసివేయడంలో ఎందుకు నీకంత ప్రేమ అంటూ ప్రశ్నించారు. నంద్యాల జిల్లాపై నీకేమైనా అక్రోషమా అంటూ ఉగ్రరూపం దాల్చారు. నాడు నేడు కింద కోట్లాది రూపాయలు ఖర్చుచేసి విద్యార్థులు పాఠశాలల్లో ఉన్నప్పటికి టీచర్లను లేకుండా చేసి నంద్యాల జిల్లాను నాశనం చేయాలని కంకణం కట్టుకున్నావా అంటూ ప్రశ్నలవర్షం కురిపించారు. డిఇఓ రంగారెడ్డి వివరణ ఇస్తు జిల్లాలో 2 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటన్నింటిని భర్తీచేసే సమయంలో నిబంధనలకు అనుగుణంగానే వ్యవహరించానని పేర్కొన్నారు.

# ప్రమాదాలకు నెలవుగా మారిన రోడ్లు..

:-రోడ్డుపై ఆటో బోల్తా..విద్యార్థులకు గాయాలు..

:-తప్పిన పెను ప్రమాదం..

:-రోడ్డుపై నీరు నిలిచిన గుంతలో అదుపు తప్పిన ఆటో..

:-రోడ్డపై భారీ గుంతలు పడినా పట్టించుకోని అధికారులు..





గాయాల పాలైన విద్యార్థులు..

**కోసిగి, జూలై 22, ప్రభాతవార్త** : కోసిగిలోని ప్రధాన రహదారులన్నీ ప్రమాదాలకు నెలవులుగా మారుతున్నాయి.. పెద్ద గుంతలతో రోడ్డు ఉండడంతో కురిసిన వానకు ఆ గుంతలలో నీరు నిలిచిపోవడంతో ఎక్కడ గుంత ఉందో తెలియక వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి.. ఇందులో భాగంగానే శనివారం విద్యార్థులతో కోసిగికి వస్తున్న ఒక ఆటో కోసిగిలోని ఎస్సార్ పెట్రోల్ బంకు వద్ద ప్రధాన రహదారిపై గుంతలో అదుపు తప్పి బోల్తా పడింది.. ఇందులో బడికి వెళ్తున్న విద్యార్థులు ఒక్కసారిగ కింద పడిపోయారు..విద్యార్థులకు తీవ్ర గాయాలై ప్రాణ నష్టం జరగలేదు.. కోసిగి మండలంలోని గౌడాగల్లు గ్రామానికి చెందిన 20 విద్యార్థులు కోసిగిలోని ఉన్నత పాఠశాలకు వచ్చేందుకు ఆటో ఎక్కారు.. కిక్కిరిసిన ఈ ఆటో కోసిగికి వస్తుండగా పెట్రోల్ బంకు వద్ద ఉన్న పెద్ద గోతిలో నీరు నిలిచి ఉండడంతో గమనించని ఆటో డ్రైవర్ గుంతలోకి వెళ్లాడు.. దీంతో ఆటో అదుపు తప్పి అక్కడనే పెట్రోల్ బంకు ముందురే కింద పడిపోయింది..వెంటనే విద్యార్థులు పెద్దపెద్దగా అరుపులు వేసారు.. రోధించారు.. ఇందులో ఉన్న విద్యార్థులు కిందపడగా వారి పుస్తకాలు చెల్లాచెదురయ్యాయి.. అంతేకాక పాఠశాల యూనిఫామ్ కూడా బురదమయమయ్యింది.. కొంత మందికి తీవ్రగాయాలు కాగా, మరి కొంతమందికి స్వల్పగాయాలు అయ్యాయి.. ఆటో కింద పడిన వెంటనే అక్కడే ఉన్న కొంత మంది వచ్చి ఆటోను పైకి లేపి విద్యార్థులను కాపాడారు... అయితే ఎవ్వరికి కూడా ప్రాణనష్టం జరగలేదు..సమాచారం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు హుటాహుటిన గౌడగల్లు నుండి వచ్చి గాయాలు పాలైన వారి వారి పిల్లలను చికిత్స నిమిత్తం వివిధ ఆసుపత్రులకు తీసుకెళ్లారు..కాగా ఈ గ్రామం నుండి ఆర్టీసి బస్సులు విద్యార్థులకు లేకపోవడంతో వీరందరు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తూ ఇలా ప్రమాదాలకు గురవుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..గత నాలుగు రోజులుగా కురుస్తున్న వానలకు కోసిగిలోని ప్రధాన రహదారులలో ఏర్పడిన గుంతలన్నీ నీటితో నిండిపోయి చెరువులను తలపిస్తున్నాయి..కానీ ఆర్అండ్‌బి అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో రోజు ఏదో ఒకచోట వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి.. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోతుల మయమైన రోడ్లను బాగు చేయాలని కోరుతున్నారు..

## వెల్దుర్తిలో బిఎల్‌ఓ సస్పెన్షన్

- వాలంటరీ తొలగింపు..
- ఓటర్ల జాబితా పరిశీలనలో బిఎల్‌ఓ గ్రామ,వార్డు వాలంటరీతో కలిసి పాల్గొన్నాడని సస్పెన్షన్..



2లో

**వెల్దుర్తి,జులై22,ప్రభాతవార్త** : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పత్తికొండ నియోజకవర్గంలోని వెల్దుర్తి పట్టణంలో నిర్వహించిన ఇంటింటి ఓటర్ల పరిశీలన కార్యక్రమంలో బిఎల్‌ఓ గ్రామ,వార్డు వాలంటరీతో కలిసి పాల్గొన్నట్లు ఆరోపణలు రాగా శనివారం పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్,వెల్దుర్తి మండల తహశీల్దార్ శివరాముడుతో కలిసి ఇంటింటి ఓటర్లను విచారించారు.వారి విచారణలో బిఎల్‌ఓగా విధులు నిర్వహిస్తున్న వెల్దుర్తి-1 సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ అధికారి రామక్రిష్ణ,గ్రామ,వార్డు వాలంటరీతో కలిసి పాల్గొన్నట్లు ఓటర్ల ద్వార తెలుసుకున్న ఆర్డీఓ,తహశీల్దార్ జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపారు.

## దొంగతనాలకు పాల్పడ్డ ఐదు మంది ముద్దాయిలు అరెస్టు

**-105 గ్రాముల బంగారు, రూ.3.25 లక్షల నగదు స్వాధీనం**



**నంద్యాల క్రైం, జూలై 22, ప్రభాతవార్త:** పట్టణంలోని టూటౌన్ పిఎస్ పరిధిలో లైఫ్ అసుపత్రి ఎదురుగా ఉన్న తులసి నిలయం షాదిక్‌నగర్‌లో ఓ ఇంటిలో దొంగతనానికి పాల్పడ్డ ఐదు మంది పండిట్ ఉత్కర్ష్ తంబి పవన్, ఆదిత్య, చాగం వెంకటనాగ చరణ్‌రెడ్డి, పసుపులేటి మహేంద్ర, కందుకూరి హేమంత్‌లను సుంకులమ్మ పరమేశ్వరీ దేవాలయం జీవిచెట్టు దగ్గర ఐదు మందిని అరెస్టుచేసి వారి నుంచి 105 గ్రాముల బంగారం, రూ.3.25 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ సిఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఇందులో పోలూగారి వినయ్‌కుమార్ దేవనగర్ పరార్‌లోఉన్నాడని తెలిపారు. ఇంకా అతని వద్ద నుంచి 12 గ్రాముల బంగారం రికవరీ చేయాల్సి ఉందని తెలిపారు. జిల్లా ఎస్పీ ఉత్తర్వుల మేరకు నంద్యాల ఎస్‌డిపిఓ డిఎస్పీ మహేశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో టూటౌన్ సిఐ ప్రభాకర్‌రెడ్డి, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఎస్‌ఐలు నాగార్జున్‌రెడ్డి, సిబ్బంది అధ్వర్యంలో దొంగలను పట్టుకున్నారు. ఈనేపథ్యంలో జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, టూటౌన్ సిఐ, ఎస్‌ఐలను అభినందించారు.

## 11.8 లక్షలతో అటవిశాఖ

# రోడ్డు పనులు పూర్తి

**ఎనిమల్స్ కదలికలను పసిగట్టే సిబ్బందికి రహదారి**





పనుల వివరాలు వెల్లడిస్తున్న రైంజ్ అధికారి నరసింహులు

**శ్రీశైలంప్రాజెక్టు,జులై22,ప్రభాతవార్త** : అభివృద్ధి మంత్రమే అలంబనగా పాటిస్తూ నల్లమల్ల నట్టడవికి అటవిశాఖ 2022-2023 వ సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం నుండి కంప స్కీం నిధులను ఉపయేగించుకుంటూ శ్రీశైలం రైంజ్ ఎకోడేవలఫ్‌మెంటు కమిటి ద్వారా పనుల నిర్వహణతో అటవిశాఖ పెచ్చెరువు ప్రాంతానికి 6 కిలోమీటర్ల మేర గ్రావెల్ రోడ్డు మరియు కల్వర్ట్ మెయింటినేన్స్‌కు రమారమి రూ.6.8 లక్షల వరకు నిధులను వెచ్చించి పనులను నిర్వహొంచడం జరిగిందని శ్రీశైలం రైంజ్ అదికారి వి.నరసింహులు తెలిపారు.అదే విధంగా నీలిగంగా బెస్ క్యాంపుకు 1.2 కిలోమీటరర్ల మేర రూ.5 లక్షల రూపాయాల నిధులతో గ్రావేల్ రోడ్డును పూర్తి చేయడం జరిగిందని వివరించారు.ఈక్రమంలోనే బిల్వవనం బెస్ క్యాంపుకు సిసి రోడ్డును అదునికరించి రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పనులను చేయడం జరిగిందని చెప్పారు.ఈ రోడ్ల నిర్మాణ ప్రక్రియ అంతా నిత్యం అటవిశాఖ సిబ్బంది రాకపోకలకు అనువుగా ఉండే విధంగా చేయడం జరిగిందని అన్నారు.అడవిలో ఎమైన ఎనిమాల్స్ మూమెంట్స్ కదలికలు జరిగితే వేగవంతమైన సమాచారం,రాకపోకలకు,విధుల రిత్యా ఉధ్యోగులకు ఏమైన ఆనారోగ్య సమస్యలు తలేత్తితే త్వరితగతిన చికిత్స నిమిత్తం వచ్చేందుకు,కేవలం అటవిశాఖ అదికారులకు,సిబ్బంది ప్రయేజనాల కొరకు ఈ రహదారులను ఉపయేగించడం జరుగుతుందని వివరించారు.ఈ పనుల నిర్వహణ అంతా అటవిశాఖ ఉన్నాతాదికారుల పర్యవేక్షన,సూచనల మేరకు పూర్తి చేయడం జరిగిందని అన్నారు.శ్రీశైలం రైంజ్‌లో జరుగుతున్న పనుల తీరుతేన్నులను అటవిశాఖ ఉన్నాతాదికారులు ఎప్పటికప్పుడు మానటరింగ్ చేయడం జరుగుతుందని తెలిపారు.అటవిశాఖ పరిరక్షణ,వన్యప్రాణుల సంరక్షణ,అటవి సిబ్బంది రక్షణ తదితర వంటి వాటిపై ఆదికార యంత్రాంగం నిత్యం తమదైన శైలిలో పనిచేయడం జరుగుతుందని చెప్పారు.

## "నేటి భారతం" చిత్రం ట్రైలర్‌ను ప్రారంభించి పోస్టర్‌ను విడుదల చేసిన నారాచంద్రబాబు



2లో

**కర్నూలు న్యూసిటి, జూలై 22, ప్రభాతవార్త:** "నేటి భారతం" చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను ప్రారంభించి పోస్టర్‌ను తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు విడుదల చేశారు. చిత్ర దర్శకులు డా.శ్రీధర్‌రాజు, కర్నూలు పార్లమెంటు తెలుగుదేశం అధ్యక్షులు బిటి నాయుడు అత్యంత అప్తుడు స్నేహితుడు అయినందున ఈకార్యక్రమానికి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు హాజరు కావడం జరిగిందన్నారు. చిత్రం గురించి బిటి నాయుడు నాయుడు మాట్లాడుతూ ఈచిత్రం 80 నిమిషాల నిడివితో నిర్మితం కాబడుతున్నదని ఇందులో ప్రధాన ఇతివృత్తంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తరువాత 2014లో ఆంధ్రరాష్ట్రానికి అన్ని వర్గాల ప్రజల రాజకీయ పార్టీల అంగీకారంతో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం రాజధానిని అమరావతిలో నిర్మించేందుకు నిర్ణయించిన సందర్భంలో ఆ ప్రాంతంలోని రైతులు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై నమ్మకంతో దాదాపు 32 వేల ఎకరాల భూమిని రాజధాని నిర్మాణం కోసం రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రభుత్వానికి తమ భూములను ధారదత్తం చేయడం జరిగింది. అలాంటి రైతులను 2019లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి మూడు రాజధానులంటూ డ్రామాను మొదలుపెట్టి అమరావతి భూముల విషయంలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందనీ కట్టుకథలు చెప్పి అమరావతి రాజధాని రైతులను ఎన్ని విధాలుగా వేధింపులకు గురిచేస్తున్నారు అనే ఇతివృత్తాన్ని వివరించడం ఇందులో ఉంటుందని తెలిపారు.

# జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి



2లో

**కర్నూలు రూరల్,జూలై 22,ప్రభాతవార్త** : జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేద్దామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి,మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి,నంద్యాల జిల్లా ఇంచార్జ మంత్రి అంజాద్ భాష అన్నారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో జడ్‌పి చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన నాడు-నేడు, గృహ నిర్మాణం,వ్యవసాయం, గ్రామీణ నీటి సరఫరా-పారిశుద్ధ్యం అంశాలపై జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం,నంద్యాల ఎంపి పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి,మధు సూదన్,ఎంవి రామచంద్రారెడ్డి, కలెక్టర్ సృజన,నందికోట్కూరు, పాణ్యం, బనగానపల్లె,నంద్యాల,కోడుమూరు ఎమ్మెల్యేలు ఆర్థర్,కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కాటసాని రామిరెడ్డి,శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి,సుధాకర్,డిసిఎంఎస్ చైర్మన్ శిరోమణి,కర్నూలు,నంద్యాల జిల్లాల జడ్‌పిటిసిలు,ఎంపిపిలు,జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి,మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి,నంద్యాల జిల్లా ఇంచార్జ మంత్రి అంజాద్ భాష మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడం మన రాష్ట్రంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మన రాష్ట్రం రైతులకు ఏ విధంగా సేవలందిస్తుందని వివిధ రాష్ట్రా ప్రిన్సిపల్ సెక్రటరీలు,కేంద్రమంత్రులు వచ్చి తెలుసుకుంటున్నారన్నారు. రాష్ట్ర రైతులకు మనం ఏవిధంగా సేవలందిస్తున్నామో దీన్ని బట్టి తెలిసిపోతుందన్నారు. అనంతరం జడ్‌పి చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ చాలామంది ఆడపిల్లలు పదవ తరగతి చదివిన తర్వాత పాఠశాలలు మానేస్తున్నారని అలాంటి వారి కొరకు కస్తూరిబా పాఠశాలలో ఇప్పుడున్నటువంటి 200సీట్ల నుండి 280సీట్లకు పెంచాలని పాణ్యం ఎమ్మెల్యే జిల్లా పరిషత్ చైర్మన్ దృష్టికి తీసుకురాగా దీనిపై కూడా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని తీర్మాణించినట్లు తెలిపారు. కార్మిక శాఖ మంత్రి జయరాం మాట్లాడుతూ బెళగల్ ఎంపిపి సభ్యుడు కోరిన మేరకు బెలగల్ మండలంలో రోడ్డు బాగు చేయించాలని పంచాయతీ రాజ్ ఎస్ఈని తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## పంటపొలాలు నాశనం..

# అన్నదాతలు ఆగ్రహం..



2లో

**తుగ్గలి,జూలై 22,ప్రభాతవార్త** : మండల పరిధిలోని తుగ్గలి,జొన్నగిరి, ఎర్రగుడితో పాటు మరిన్ని గ్రామాల్లో వజ్రాల అన్వేషణకు వివిధ ప్రాంతాల నుండి జనం వందల సంఖ్యలో తరలివస్తున్నారు. పంటపొలాలలో జనం వజ్రాల అన్వేషణకు ఎటుపడితే అటు వందల సంఖ్యలో తిరుగుతుండడంతో పంట దెబ్బతిని,పొలం గట్టిబడి వ్యవసాయానికి అనుగుణంగా లేకుండ పోతుందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పొలాలను సాగు చేసుకునేందుకు అప్పులు చేసి పంట పొలాలను సాగు చేసుకోవడం జరిగిందన్నారు.

## మాదిగ మూడవ విశ్వరూప మహాసభలను విజయవంతం చేద్దాం

**ఆళ్లగడ్డ, జూలై 22, ప్రభాతవార్తః** ఎస్సీ వర్గీకరణ లక్ష్యసాధన కోసం మరో పోరాటానికి ఆగష్టు రెండవ వారంలో జరిగే ఛలో హైదరాబాద్ మాదిగల మూడవ విశ్వరూప మహాసభను జయప్రదం చేయడానికి ఆళ్లగడ్డ నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ అతిదిగృహంలో ఎంఎస్‌పి జిల్లా కో-కన్వీనర్ కెపి పెద్ద ఓబులేసు మాదగ, తాలూక అధ్యక్షులు నాగిపోగుల పెద్ద ఓబులేసు మాదిగ, ఎంఇఎఫ్ ఆళ్లగడ్డ తాలూక అధ్యక్షులు వెంకటేశ్వర్లు మాదిగ, మండల ఎంఎస్ఈ అధ్యక్షులు బాల ఓబులేసు మాదిగ అధ్వర్యంలో అనుబంధ సంఘాలతో కలిసి శనివారం ఆళ్లగడ్డలో సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా నంద్యాల జిల్లా ఇంచార్జీ సుభాస్‌చంద్ర మాదిగ, మహాజన సోషలిస్టు పార్టీ నంద్యాల జిల్లా అద్యక్షులు కత్తి ఓబులేసు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు శివనారాయణ మాదిగలు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా మదిగ బిడ్డలు మరోపోరాటానికి సిద్దం కావాలని వారు కోరారు.

## పండ్ల తోటల కొరకు పొలం పరిశీలన ఏపీడి

**ఉయ్యాలవాడ, జూలై 22, ప్రభాతవార్తః** ఉయ్యాలవాడ మండలంలో పండ్లతోటల పెంపకం కొరకు పొలాలను ఏపీడి సాంబశివరావు పరిశీలించారు. ఈసందర్భంగా రూపనగుడి గ్రామంలో ఫీడర్‌కెనాల్‌లో పూడికతీత పనులను పరిశీలించడం జరిగింది. ఉయ్యాలవాడ గ్రామంలో రైతు హరినాథ్ పొలంలో నాటిన కొబ్బరి మొక్కలను ఆయన పరిశీలించారు. శుద్దమళ్ళ గ్రామంలో రైతు చామంతి పొలంలో మునగపంటను పరిశీలించడం జరిగింది. మండలంలో 75 ఎకరాలు హార్టికల్చర్ టార్గెట్ ఇవ్వగా 80 ఎకరాల పొలం గుర్తించి మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. మునగతోటకు 5 ఎకరాలకు గాను 6 ఎకరాలు గుర్తించామని ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కల పెంపకం ఒకటికి రెండుచోట్ల గుర్తించడం జరిగిందని టేకు మొక్కలు రెండు ఎకరాలకు గాను 1.50 ఎకరాలు గుర్తించడం జరిగిందని బ్లాక్ ప్లాంటేషన్ కింద 1కి 1 గుర్తించడం జరిగిందన్నారు. ఈయన వెంట ఏపీఓ రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## మొహర్రం వేడుకలు షురూ..

**వెల్దుర్తి, జూలై22, ప్రభాతవార్త :** వెల్దుర్తి మండలంలో గత 4 రోజుల కిందట నుంచి మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల్లో భాగంగా మండల కేంద్రమైన వెల్దుర్తిలో శనివారం దస్తగిరి స్వామి, పెనుకొండ బాబాఫకృద్దీన్(పెనుకొండ బాబయ్య) పీర్లస్వాముల పెట్టేలను మేళతాళాలతో పట్టణ పురవీధుల్లో ఊరేగింపు చేశారు. అనంతరం పీర్లచావిడులలో పీర్లస్వాములను భక్తిశ్రద్దలతో ప్రతిష్టించారు. పట్టణంలో 6 చోట్ల పీర్లచావిడులు ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. మండలంలోని వెల్దుర్తి, నార్లాపురం, పుల్లగుమ్మి తదితర గ్రామాల్లో సైతం పీర్లస్వాములను ఊరేగించారు. ఈ వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా వెల్దుర్తి సిఐ యుగంధర్ ఆధ్వర్యంలో ఎస్సై చంద్రశేఖర్‌రెడ్డి బందోబస్తు చర్యలు చేపట్టారు.

## మణిపూర్‌లో మహిళల పై జరిగిన లైంగిక దాడి అమానుషం

**బనగానపల్లె, జూలై22, ప్రభాతవార్త:** మణిపూర్‌లో మహిళల పై జరిగిన లైంగికదాడి అమానుషమని ఏఐటీయుసీ నంద్యాల జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శివబాలకృష్ణ, ఏపీ మహిళా సమాఖ్య నాయకురాలు వెంకటలక్ష్మమ్మలు అన్నారు. శనివారం పట్టణంలోని ఏఐటీయుసీ కార్యాలయంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ మణిపూర్ మహిళలను బహిరంగంగా ఊరేగించిన వారిని వెంటనే ఉరి తీయాలని అలాగే రాష్ట్రంలో కూడా మహిళల పై దాడులు పెరిగిపోయాయని దీనికి బాధ్యత వహిస్తూ ముఖ్యమ ంత్రి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. మణిపూర్ రాష్ట్రంలో మహిళలను అత్యాచారం చేసి నగ్నంగా ఊరేగించి హత్య చేసిన రౌడీ మూకలను తక్షణమే ఎన్‌కౌంటర్ చేసి మృతి చెందిన మహిళల ఆత్మకు శాంతి కలిగించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సురేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## 25న నియోజకవర్గస్థాయి సమీక్షా సమావేశం

– హాజరుకానున్న బనగానపల్లె ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ – ఎంపిడివో శివరామయ్య

**బనగానపల్లె, జూలై22, ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని అన్ని శాఖల సమస్యల పై చర్చించి వాటిని పరిశీలించి పరిష్కరించే కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ఆదేశాల మేరకు ఈనెల 25వ తేదిన ఎంపిడివో కార్యాలయంలో ఉదయం 10.30గంటలకు నియోజకవర్గస్థాయి సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు బనగానపల్లె ఎంపిడివో ఏ.శివరామయ్య తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని వివిధ ముఖ్యమైన సమస్యల పై సమీక్షా సమావేశం నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్, స్థానిక ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిల ఆధ్వర్యంలో ఈ సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, జిల్లాస్థాయి, నియోజకవర్గస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆయా మండలస్థాయి అధికారులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

## బనగానపల్లె తహసీల్దార్‌గా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ

**బనగానపల్లె, జూలై22, ప్రభాతవార్త:** బనగానపల్లె తహసీల్దార్‌గా వై.వెంకటేశ్వర్లు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటేశ్వర్లను ఏపీఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పూలరాజు పూలమాలతో సత్కరించి సాదర స్వాగతం పలికారు. కాగా తహసీల్దార్ వెంకటేశ్వర్లు గోస్పాడు మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తుండేవారు. అయితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బనగానపల్లెకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వీఆర్వోలు, మండల సర్వేయర్లు, కార్యాలయ సిబ్బంది వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే వారి సమస్యలను పరిష్కరించి వారితో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని ఆయన సూచించారు. కిందిస్థాయి సిబ్బంది చేయలేని పనులను తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కారమయ్యే చూస్తానని ఆయన తెలిపారు. అనంతరం ఎస్సీల స్థితిగతులు తెలుసుకుని వారికి అధికారులు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని ఎమ్మార్పీఎస్ నేత కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎమ్మార్పీఎస్ మీడియా కన్వీనర్ మధు, ఎమ్మార్పీఎస్ నేతలు వెంకటస్వామి, దక్కల సంఘం అధ్యక్షుడు సవారి తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలి

**బనగానపల్లె, జూలై22, ప్రభాతవార్త:** బనగానపల్లె మండలంలోని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శివశంకరుడు శనివారం పట్టణంలోని 4వ సచివాలయం పరిధిలో గల ఎస్సీ బాలుర హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివశంకరుడు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలంలో విద్యార్థులు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని, వ్యక్తిగత మరియు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్‌వో నల్లగట్ల వెంకటేశ్వర్లు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## మహిళలను వివస్త్రలను చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

**నంద్యాల టెక్కె, జూలై 22, ప్రభాతవార్తః** మణిపూర్‌లోని కుకీ తెగకు చెందిన స్త్రీలను వివస్త్రలను చేసి హినాతి హినంగా క్రూరాతి క్రూరంగా హింసించి, బహిరంగంగా ఊరేగించి అత్యాచారం చేయుట అన్న విషయం సభ్య సమాజం, పాలక ప్రభుత్వాలు అయిన బిజెపి పార్టీ నిసిగ్గుగా తలదించుకోవాల్సిందేనని దళిత బహుజన కార్యచరణ కమిటీ సభ్యులు అవేదన వ్యక్తం చేశారు. శనివారం నంద్యాల నిశాంతిభవన్‌లో ప్రత్యేక సమావేశాన్ని దళిత బహుమజన ఐక్యకార్యచరణ కమిటీ అధ్యక్షులు మేకల లింగస్వామి అధ్యక్షతన నిర్వవమంచారు. సమావేశంలో గౌరవాధ్యక్షులు కొమ్ముపాలెం శ్రీనివాస్ ఏసివి సుబ్బయ్య, మొలక చందనం లక్ష్మన్న, ఉపాధ్యక్షులు గుర్రం లక్ష్మీ, బెల్లం రాజకుమార్, బిసి సంఘం అధ్యక్షులు వై నాగేశులు, న్యాయవాది వనం శ్రీనివాసులు, జాన్సన్, సుధాకర్, గంటల గిరి, జాకబ్ ఉశేన్, సునీల్ తదితరులు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. మనదేశంలో మేధావులు, ప్రజా ఉద్యమకారులు, సామాజిక వాదులు, మణిపూర్ కుకీ తెగకు చెందిన స్త్రీలను నగ్నంగా ఊరేగించి పరమకిరాతకంగా అత్యాచారం చేసినప్పటికి వారు మౌనం పాటించడం వెనుక సత్యం ఏమిటో విజ్ఞులకే ఏరుక అన్నారు. ఒక యువకుడిని క్రూరాతి క్రూరంగా హింసించి ఆ యువకుడిపై మూత్రం పోసి చేసిన సంఘటనపై వారిని ఉరితీయాలని వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వ పాలనలో ఇలాంటి సంఘటనలు జరగడం దురదృష్టకరమని ఇలాంటి సంఘనలపై దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని చేపడతామని వారు పేర్కొన్నారు. సమావేశంలో కృష్ణ, యల్లయ్య, జాకబ్, సుంకయ్య, సర్వయ్య, దస్తగిరి, శ్రీనివాసులు, రాముడు, రమేష్‌బాబు, శ్రీను, సుభాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలపై నుండి క్రిందపడి ప్రధానోపాధ్యాయుడికి తీవ్ర గాయాలు

**సూగూరు(మంత్రాలయం), జూలై 22, ప్రభాతవార్త:** మండల పరిధిలోని సూగూరు గ్రామంలో ఉన్న ఎంపిపిఎస్(డిపిఈపి) పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాఠశాలపై నుండి క్రిందపడి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల మేరకు గ్రామంలో ఉన్న ఈ పాఠశాలలో నాడు-నేడు పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గురుస్వామి వాటర్ క్యూరింగ్ చేస్తుండగా కాలుజారి ఒక్కసారిగా క్రింద పడ్డాడు. ఈ సంఘటనలో ప్రధానోపాధ్యాయుడి చేయి విరిగింది. అదేవిధంగా తలకు బలమైన గాయాలయ్యాయి. హుటాహుటిన ప్రధానోపాధ్యాయుడిని మెరుగైన వైద్యం నిమిత్తం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. ప్రధానోపాధ్యాయుడికి తృటిలో ప్రాణాపాయం తప్పినట్లు తెలిసింది. ప్రస్తుతం ప్రధానోపాధ్యాయుడి ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు సమాచారం.

## సబ్జెక్టు ఉపాధ్యాయుల డిప్యూటేషన్లు రద్దచేయాలి

**నంద్యాల విద్య, జూలై 22, ప్రభాతవార్తః** ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇచ్చి నెల రోజులు కాలేదు, అప్పుడే నంద్యాల జిల్లా నుంచి కర్నూలు జిల్లా అధోని బార్డర్‌కు ఎలా డిప్యూటేషన్ వేస్తారంటూ ఎస్టీయు రాష్ట్ర సహాధ్యక్షులు చంద్రశేఖర్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి అజాంబేగ్, మౌలాలిలు డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్దంగా కర్నూలు జిల్లా డిఇఓ రంగారెడ్డి డిప్యూటేషన్లు వేస్తున్నారని ఆరోపించారు. డిప్యూటేషన్లు వేయాలంటే అదే మండలంలో కానీ పక్క మండలాల్లో వేయాలని ఉత్తర్వులు ఉన్నప్పటికి డిఇఓ ఇష్టారాజ్యంగా నిబంధనలకు నీళ్లు వదలి సుదూర ప్రాంతాలకు డిప్యూటేషన్లు వేస్తున్నారని పేర్కొన్నారు. తెలుగు ఐదు మంది, ఆంగ్లం 13 మంది, గణితం 7 మంది, భౌతికశాస్త్రం 14 మంది, జీవశాస్త్రం 30 మంది, సోషల్ 29 మందితో కలిసి 95 మంది సబ్జెక్టు ఉపాధ్యాయులను సుదూర ప్రాంతాలకు కేటాయించారని పేర్కొన్నారు. శనివారం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో కూడ ఎమ్మెల్యేలు డిఇఓ రంగారెడ్డి వ్యవహారశైలీపై గంటన్నరసేపుచర్చిండం విశేషం. ఎమ్మెల్యేల ఫోన్లు, ప్రజాప్రతినిధుల ఫోన్లు, విలేఖరుల ఫోన్లు ఎత్తని డిఇఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటేషన్లు రద్దుచేయాలని లేనిచో ఉద్యమానికి వెనుకాడమని పేర్కొన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు సుబ్బయ్య, మౌలాలి, మల్లేశ్వరుడు, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీగిరిలో సాంస్కృతిక కార్యక్రమాలు

**శ్రీశైలంప్రాజెక్టు, జూలై22, ప్రభాతవార్త :** శ్రీశైలం దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా(నిత్య కళారాధన కార్యక్రమంలో బాగంగా)శనివారంనాడు శ్రీ నృత్య కీర్తన సంగీత అకాడమీ హైదరబాద్ వారిచే భక్తి రంజనీ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. కాగా ఆలయ దక్షిణ మాడవీదిలోని నిత్యకళారాధన వేదిక వద్ద సాయంకాలం నుండి ఈ భక్తి రంజనీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమములో పాహి పాహి గజానన, నమ:శివాయ, ఎందుకయా సాంబశి, కాళీ మహేశ్వరి, శివం భజే భవం భజే, అమ్మలగన్న తదితర గీతాలకు అనురాద, శ్రావణీ, రాధ, ప్రీతీ, ఉదయరాణీ, కీర్తన శ్రీదేవి తదితరలు అలాపించారు. ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజు సంప్రదాయనృత్యం, వాయిద్య సంగీతం, భక్తి రంజిని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్ని పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ ధర్మపథం కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.

## వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేస్తే అభివృద్ధికి ఓటు వేసినట్లే.....

**మిడుతూరు, జూలై22, ప్రభాతవార్త ;** వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేస్తే అభివృద్ధికి ఓటు వేసినట్లేనని టీడీపీ మిడుతూరు మండల కన్వీనర్ కాతా రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బైరాపురం గ్రామంలో శనివారం టీడీపీ మిడుతూరు మండల కన్వీనర్ కాతా రమేష్‌రెడ్డి, చాకర్‌వలీ ఆధ్వర్యంలో మహాశక్తి మరియు భవిష్యత్‌కు గ్యారంటీ జనమహా చైతన్య రథ యాత్రను నిర్వహించారు. కాతా రమేష్‌రెడ్డి యాత్రలో పాల్గొని గ్రామంలోని ప్రజా సమస్యలు వింటూ మినీ మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరిస్తూ ఇంటింటికి వెళ్లి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడబిడ్డ నిధి పథకం ద్వారా 18 యేళ్ల నిండిన మహిళలకు నెలకు రూ.1500, యేడాదికి రూ.18 వేలు, ఐదేళ్లకు రూ.90 వేలు వస్తుందన్నారు. తల్లికి పథకం ద్వారా ప్రతి బిడ్డకు యేడాదికి రూ.15 వేలు చొప్పున ఎంత మంది పిల్లలు ఉంటే అన్ని రూ.15 వేలు అందించడం జరుగుతుందన్ననరు. దీపం పథకం ద్వారా యేడాదికి మూడు గ్యాస్ సిలిండర్‌లు ఉచితమని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం చేసేలా పథకం ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు టీడీపీకి ఓటు వేసి గెలిపిస్తే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పథకాలన్నీ అమలులోకి వస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మహిళా సంఘం అధ్యక్షురాలు జయమ్మ, మహేష్‌రెడ్డి, శ్రీనివాసులు, బోయ సుధాకర్, మహబూబ్‌సాహెబ్, మాబాషా, మహేశ్వరి, శ్యామలమ్మ, లలితమ్మ, మరియమ్మ, రాధమ్మ, కళావతి, మార్తమ్మ, సుబ్బలక్ష్మి, భాగ్యమ్మ, నాగమ్మ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రాష్ట్రాభివృద్ధి జగనన్నతోనే సాధ్యం

**అవుకు, జూలై22, ప్రభాతవార్త:** అవుకు మండలంలోని జనుంతల గ్రామ సచివాలయం నందు శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అవుకు మండల అధ్యక్షులు చల్లా రాజశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపిపి చల్లా రాజశేఖర్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులైన వారికి వారు దరఖాస్తు చేసుకున్న పత్రాలను అందజేశారు. అనంతరం చల్లా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాభివృద్ధి జగనన్నతోనే సాధ్యమవుతుందని ఆయన తెలియజేశారు. జగనన్న ప్రభుత్వంలో కులాలకు, మతాలకు, రాజకీయాలకు అతీతంగా పథకాలను అమలుచేసు_్నారని సచివాలయాలు, వలంటరీ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను నేరుగా లబ్దిదారుల ఇంటి వద్దకే వెళ్లి అందిస్తున్న ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఆయన తెలియజేశారు. రా ష్ట్రంలో అర్హులందరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని సాంకేతిక కారణాలతో లేదా మరే ఇతర కారణాలతో పథకాలు అందకుండా ఉన్నవారిని గుర్తించి అర్హులకు పథకాలను మంజూరు చేస్తారని ఆయన తెలియజేశారు. జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం జిల్లా, పట్టణ, గ్రామాల్లో ఉన్న ప్రజలకు జనన, మరణ, కుల, ఆదాయ, రేషన్‌కార్డు డివిజన్, హౌస్‌హోల్డ్ డివిజన్ మరియు ఇతర సర్టిఫికెట్లను అర్హులైన వారికి ఉచితంగా అందించడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## లోకాయుక్త సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

– నేటి నుంచి ఏపీ లోకాయుక్తకు ప్రత్యేక వెబ్‌సైట్

**నంద్యాల విద్య, జూలై 22, ప్రభాతవార్తః** లోకాయుక్త సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లోకాయుక్త జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి సూచించారు. అవినీతి అధికారులపై ఫిర్యాదు రాష్ట్ర లోకాయుక్త సంస్థ ఉపయోగపడుతుందన్నారు. ఇప్పటి వరకు రెండు తెలుగు రాష్ట్రాల లోకాయుక్తకు ఒకే వెబ్‌సైట్ ఉండగా నేటి నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు లోకాయుక్త జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి శనివారం వెల్లండించారు. ప్రభుత్వ అధికారులు ఉద్యోగు విధుల్లో నిర్లక్ష్యం, అవినీతి, చట్టవిరుద్దంగా చేయని పనులు చేయడం, చేయాల్సిన విధులు, బాధ్యతలు నిర్వహించకపోవడం వంటి వాటిపై ఫిర్యాదులు స్వీకరించి విచారణ జరిపి చర్యలు తీసుకోవడానికి ఉన్న సంస్థ రాష్ట్ర లోకాయుక్త సంస్థ. ఫిర్యాదు రుసుం రూ.150 పోస్టల్ గానీ, ఎంఓ ద్వారా గానీ బ్యాంకు డిడి తీసి జత చేసి పంపాలి. ఫిర్యాదులు స్వీకరించడానికి ఏపీ లోకాయుక్త వెబ్‌సైట్ లోకాయుక్త.ఏపీ.జీఓవి.ఇన్‌కు పంపాలని లేదా ద ఇన్స్టిట్యూషన్ అఫ్ లోకాయుక్త డోర్ నం.96/3-72-124-1, సంతోష్‌నగర్ మెయిన్‌రోడ్ మహింద్ర షోరూం వెనుక కర్నూలు 518006 అనే అడ్రస్‌కు ఫిర్యాదులు పంపాలని జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి రాష్ట్రంలోని ఫిర్యాదుదారులకు సూచించారు.

## "నేటి భారతం" చిత్రం ట్రైలర్‌ను ప్రారంభించి పోస్టర్‌ను విడుదల చేసిన నారాచంద్రబాబు

**(మొదటి పేజీ తరువాయి)** విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కుగా ఎంతో మంది ఆంధ్రుల ప్రాణాల బలిదానంతో సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేసేందుకు పూనుకుంటే మన ముఖ్యమంత్రి తన కేసులకు భయపడి రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వంపై నోరువిప్పకుండా చోద్యం చుస్తున్నారని ఇలాంటి విషయాలను ఈచిత్రంలో ప్రదర్శించేలా నిర్మితమౌతుందని తెలిపారు.

## జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి

**(మొదటి పేజీ తరువాయి)** కలెక్టర్ సృజన మాట్లాడుతూ పాణ్యం ఎమ్మెల్యే కోరిన ప్రకారం ఉలిందకొండలోని హైస్కూల్‌ను జూనియర్ కాలేజీగా అప్‌గ్రేడ్ చేయుటకు తగిన ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. జిల్లాలో మహిళల అక్షరాస్యత చాలా తక్కువగా ఉందని, ముఖ్యంగా బాల్య వివాహాలు అరికట్టాలనే ఉద్దేశ్యంతో వెల్ఫేర్ అసిస్టెంట్లు, వాలంటరీలు, అడ్మిన్‌తో కలిసి ఇంటింటి సర్వే నిర్వహించి సుమారు 20వేల అమ్మాయిలు చదువుకోకుండ ఇళ్లలో ఉన్నారని గుర్తించడం జరిగిందన్నారు. అలాగే ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు తమ పరిధిలోని సమస్యల గురించి మాట్లాడారు.

## పంటపొలాలు నాశనం.. అన్నదాతలు ఆగ్రహం..

**(మొదటి పేజీ తరువాయి)** వజ్రాల అన్వేషణకు వచ్చిన వారు పంటపొలాల్లో పైరుపై విచ్చలవిడిగా తిరుగుతూ పంటకు నష్టం కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఆయా జిల్లాల నుంచి వజ్రాల అన్వేషణకు వచ్చిన జనాలకు వజ్రాల వ్యాపారులు సకల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. దీంతో వజ్రాల అన్వేషణకు వచ్చే వారు ఎక్కడబడితే అక్కడ గ్రామంలో తిరుగుతూ భయాందోళనకు గురి చేస్తున్నారన్నారు. మహిళలు పంట పొలాల్లో పనులకు వెళ్లాలంటే భయంభయంగా వెళ్లాల్సి వస్తుందన్నారు. గతంలో పంట పొలాలకు వెళ్లిన మహిళలపై వజ్రాల అన్వేషణకు వచ్చిన వారు దౌర్జన్యాలకు పాల్పడడం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. గతంలో పంట పొలాల్లోకి వజ్రాల అన్వేషణకు వెళ్లొద్దంటూ రైతులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎవరైతే పంటపొలాల్లోకి వజ్రాల అన్వేషణకు వెళ్తారో అట్టి వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించినప్పటికీ ఆగని వజ్రాల అన్వేషకులు పంట పొలాల్లోకి ఎటుపడితే అటు తిరుగుతూ పంటకు నష్టం కలిగిస్తున్నారని కర్షకులు వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీస్ అధికారులు గమనించి పంటపొలాల్లోకి వజ్రాల అన్వేషణకు వస్తున్న వారిని నియంత్రించి తమ పంట పొలాలను కాపాడాలని అన్నదాతలు కోరారు.

## వెల్దుర్తిలో బిఎల్ఓ సస్పెన్షన్

**(మొదటి పేజీ తరువాయి)** దీంతో జిల్లా ఎన్నికల అధికా రిగా ఉన్న జిల్లాకలెక్టర్ జి.సృజన బిఎల్ఓను సస్పెన్షన్, వాలంటరీ తొలగింపు ఉత్తర్వులు ఇచ్చారని తహశీల్దార్ శివరాముడు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మోహన్‌దాస్, తహశీల్దార్‌తో కలిసి మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహిస్తున్న బూత్‌స్థాయి అధికారులు ఇంటింటి ఓటర్ల ,ఓటర్ల జాబితా పరిశీలనలో ఇతర ఎన్నికలకు సంబంధించిన పనులకు గ్రామ, వార్డు వాలంటరీలను ఉపయోగించవద్దని, ఈ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ఆర్ఐ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు వర్సెస్ మున్సిపల్ సిబ్బంది

**నంద్యాల, జూలై 22, ప్రభాతవార్తః** కెసికెనాల్ ప్రధాన కాల్వ వెంట ప్రతిరోజు యుద్ద వాతావరణం నెలకొంది. రైతాంగానికి మున్సిపల్ సిబ్బందికి మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇందుక కారణం రైతులకు చెందిన విద్యుత్ మీటర్ల వైర్లను కత్తిరించడం తమ ఫీజు కా ్యరేర్‌లను మున్సిపల్ సిబ ్బంది తీసుకువెళ్తుండడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో రైతాంగం మున్సిపల్ సిబ్బంది తీరుపై అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్లితే నంద్యాల పట్టణానికి సాగునీరును మున్సిపల్ సిబ్బంది కెసికెనాల్ కాల్వ వెంట తీసుకుకెళ్తున్నారు. వెలుగోడు రిజర్వాయర్ నుండి షుగర్‌కేన్ స్లూయిస్ ద్వారా దాదాపు 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేసుకొని కెసికెనాల్ వెంట తీసుకెళ్తున్నారు. అయితే రైతాంగం బండిఆత్మకూరు, ఈర్నపాడు, బి కోడూరు గ్రామాల మధ్య కెసికెనాల్ వెంట వరినారుమళ్లు సాగుచేశారు. ఈక్రమంలో వర్షాలు కురువకపోవడంతో ఈఏడాది కెసికెనాల్‌కు సాగునీరును అధికారులు విడుదల చేయలేదు. అయితే ఎలాగైనా వరినారును రక్షించుకోవాలని రైతులు భావిస్తున్నారు. దీంతో విద్యుత్ మీటర్ల ద్వారా వీటిని పంపింగ్ చేసుకోవాలని రైతులు భావిస్తున్నారు. అయితే మున్సిపల్ సిబ్బంది ప్రస్తుతం వస్తున్న నీటిని నంద్యాల పట్టణానికి తాగునీటి అవసరాలకు తీసుకెళ్తున్నామని చెబుతున్నారు. ఈనీటిని ఎట్టి పరిస్థితుల్లో సాగునీటికి వినియోగించుకోరాదని చెబుతున్నారు. అయితే ఈవిషయాన్ని సమీప గ్రామాల్లోని రైతులకు ఎటువంటి సమాచారం. దండోర గానీ వేయించలేదని రైతులు తెలుపుతున్నారు. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్‌మోటర్లు అప్‌చేసినప్పటికి మున్సిపల్ సిబ ్బంది వైర్లు కత్తిరించడం, ఫీజు క్యారెర్‌లు తీసుకెళ్తున్నారని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈవిధంగా ఒక్కొక్క మోటర్‌కు సుమారు రూ.2 వేల నుంచి 3 వేల వరకు నష్టం చేస్తున్నారని చెబుతున్నారు. అయితే మున్సిపల్ సిబ్బంది ఈవిధంగా రైతులను ఆర్థికంగా దెబ్బతీయడం సమజం కాదని వాపోతున్నారు.

## ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు ; సర్పంచ్

**కౌతాళం, జూలై22, ప్రభాతవార్త ;** ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులను చేపడతామని సర్పంచ్ పాల్‌దినకర్ అన్నారు. ఈ మేరకు శనివారం మండలకేంద్రమైన కౌతాళంలో పంచాయతీ సిబ్బందితో డ్రెయినేజీ కాలువలను శుభ్రం చేయించారు. కాలువల్లో పేరుకుపోయిన మురుగును తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కూడా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కురుస్తున్న వర్షాల కారణంగా పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు చేపడతామని చెప్పారు. పంచాయతీ పరిధిలో ఎక్కడైనా పారిశుద్ధ్యం లోపిస్తే తనదృష్టికి తీసుకురావాలని, వెంటనే పారిశుద్ధ్య పనులు చేపడతామని చెప్పారు.

## 25న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

**కౌతాళం, జూలై22, ప్రభాతవార్త ;** ఈనెల 25న రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ విద్యార్థి మాఖ్య విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. రాష్ట్రంలో విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సమాఖ్య సంఘాలు ఈనెల 25వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునివ్వడం జరిగిందని ఏఐఎస్ఎఫ్ మండల ఉపాధ్యక్షులు సాయివర్మ, తాలూకా ఉపాధ్యక్షులు ఉపేంద్రచౌదరి, బసవ, సంపత్ తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాడతామన్నారు. ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. 25న చేపట్టే బంద్‌లో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## సచివాలయ అధికారులతో సమావేశం

**కౌతాళం, జూలై22, ప్రభాతవార్త ;** మండలకేంద్రమైన కౌతాళంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో శనివారం వెల్ఫేర అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లతో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జీఈఆర్)పై సమీక్షా సమావేశాన్ని ఎంపీడీఓ సుబ్బరాజు, ఎంఈఓ-2 శోభారాణి న్విహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, ఎంఈఓ-2 మాట్లాడుతూ ప్రతి సచివాలయంలో క్లస్టర్ వారీగా ఎడ్యుకేషన్ సర్వే పూర్తిగా జరగాలన్నారు. క్లస్టర్‌వాడీ ఎడ్యుకేషన్ పూర్తి చేసిన వాళ్లలో స్కూల్ వదిలేసిన విద్యార్థులను గుర్తించి, వారిని స్కూళ్లలో మరలా ఎన్‌రోల్‌మెంట్ చేయించాలని, మండలంలో ఈ రీ-ఎన్‌రోల్‌మెంట్‌కు సంబంధించి 352 వలంటీర్లకు గనాఆఊ 10 మంది వలంటీర్లు వందశాతం పూర్తి సర్వే చేయడం జరిగిందన్నారు. స్కూకక్ వదిలిన విద్యార్థులను మళ్లీ స్కూళ్లలో చేర్పించాలన్నారు. ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్స్ మరియు సీఆర్‌పీలు పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష సమస్యల పరిస్కారమునకు వేదిక

**కోవెలకుంట్ల, జూలై 22, ప్రభాతవార్త :** మన ముఖ్యమంత్రి ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష సమస్యల పరిస్కారమునకు వేదికని మేజరు పంచాయితీ సర్పంచు మెట్ల సరళ అన్నారు. శనివారము కోవెలకుంట్ల పట్టణంలో నాల్గ ్వ సచివాలయంలో సర్పంచు మెట్ల సరళ అద్యక్షతన జగనన్న సురక్ష నిర్వహించారు. ఈ సందర్బముగా అమె మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి ఇచ్చిన మాట కోసం కట్టుబడి నిరంతరము శ్రమించి మన కోసం ఎన్నో పథకాలు ప్రవేషపెట్టి మన అర్థిక పుష్టిని పెంచుతున్నాడని చెప్పారు. మన రాష్ట్రంలో జగనన్న వల్ల లబ్దిపొందని కుటుంబము ఇంత వరకు ఉండదని చెప్పారు. ప్రతి కుటుంబానికి ఏదో ఒక పథకము వల్ల మేలు జరిగిందని చెప్పారు. అలాంటి ముఖ్యమంత్రిని మళ్లి చూడాలని కోరారు. మన సమస్యలు ఇంకాఏమైన మిగిలాయో ఏమో అనే ఉద్దేశ్యంతో తిరిగి జగనన్న సురక్ష ఏర్పాట్లు చేశాడని చెప్పారు. అందుకు ప్రతి కుటుంబము ఈ సురక్షను సద్వినియోగము చేసుకోవాలని చెప్పారు. ఈకార్యక్రమంలో యంపిడిఓ రాదిక, తహశీలుదారు పుష్పకుమారి ఉపసర్పంచు సూర్యనారాయాణరెడ్డి చిక్కెపల్లె ప్రసాదరెడ్డి మండలంలోని అన్ని శాఖలఅదికారులు పాల్గొన్నారు.

## గోనెగండ్ల,హెచ్ కైరవాడిలో విత్తన దుకాణాలను తనిఖీ

**గోనెగండ్ల జూలై 22 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన గోనెగండ్లలోని విత్తన దుకాణాలను జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వెంకటేశ్వర్లు. ఎమ్మిగనూరు ఏడీఏ ఖాద్రీ, అగ్రికల్చర్ ఆఫీసర్ శశిధర్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ విత్తనాల దుకాణాలు, డీలర్స్ అందరు తప్పనిసరిగా ఫామ్ సి, సోర్స్ సర్టిఫికెట్స్‌ను ఉంచుకోవాలని అన్నారు. అలాగే ప్రతి రోజు ధరల పట్టికను అప్‌డేట్ చేసుకోవాలి అని అన్నారు. ప్రతి బిల్లు తప్పనిసరిగా రైతులు సంతకం తీసుకొని ఇవ్వాలి. ఎటువంటి పరిస్థితిలో కూడా ఎమ్ఆర్పి కి మించి అమ్మరాదని తెలిపారు. ప్రతి నెల 5వతేది లోపు క్రయ విక్రయాలు నివేదిక తప్పనిసరిగా సమర్పించాలని అన్నారు. అనంతరం విత్తన దుకాణాలు ధరణి ఏజెన్సీస్, బడేసావాలి ట్రేడర్స్, ముబారక్ ట్రేడర్స్, వేదశ్రీ ట్రేడర్స్, హెచ్ కైరవాడి వైష్ణవి ట్రేడర్స్ తనిఖీ చేశారు.

## నాటుసారా విక్రేత అరెస్ట్

**బేతంచెర్ల, జూలై22, ప్రభాతవార్త:** పట్టణంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన నాటుసారా విక్రేత దామోదరమ్మను శనివారం అరెస్ట్‌చేసినట్లు ఏఎస్ఐ లింగమయ్య తెలిపారు. సమాచారం మేరకు స్థానిక ఓ ప్రైవేట్ పాఠశాల సమీపంలో సారా అమ్ముతుండడంతో దాడిచేసి అదుపులోకి తీసుకుని ఆమె వద్ద నుండి 10లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

## పాఠశాల ఆకస్మిక తనిఖీ

**చాగలమర్రి, జూలై22, ప్రభాతవార్త:** చాగలమర్రి పట్టణంలోని గుంటపాలెం కాలనీలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో అనురాధ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అలాగే పాఠశాలలోని వివిధ రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేసి విద్యార్థులకు సెమిస్టర్-2 పుస్తకాలను ఎంఈవో అందజేశారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం రుచికరంగా విద్యార్థులకు అందించాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు గెలాబ్దిన్, ఉపాధ్యాయులు అనిఫ్, పెద్దబాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే జగనన్న సురక్ష ధ్యేయం - ఎంపిపి బుగ్గన

**బేతంచెర్ల, జూలై22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి జగనన్న సురక్ష ద్వారా అవసరమైన 11సేవలను ఇంటి వద్దకే చేర్చే విధంగా చర్యలు చేపట్టడం జరిగిందని దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి బుగ్గన నాగభూషణంరెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు బాబుల్‌రెడ్డిలు అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎం పెండేకల్, సీతారామాపురం గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లతో కలిసి జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మంజూరైనటువంటి జనన, మరణ, ఇతర ధృవపత్రాలను లబ్దిదారులకు ఉచితంగా అందజేయడం జరిగింది. అనంతరం ఎంపిపి మాట్లాడుతూ అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి వినూత్న రీతిలో పథకాలను అమలుచేయడం జరిగిందన్నారు. ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అందించడం పుట్టిన బిడ్డ నుండి వృద్దుల వరకు అర్హులైన అందరికి పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందన్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని 2024లో మీ ఆశీర్వదంతో నిలబెట్టుకోవాలని ఆయన కోరారు. ఈ కార ్యక్రమంలో తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంపిడివో వెంగన్న, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ సచివాలయాల సిబ్బంది, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష II రకాల ధృవపత్రాలు మంజూరు - ఎంపిపి,జెడ్పీటీసీ

**చాగలమర్రి, జూలై22, ప్రభాతవార్త:** జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల ధృవపత్రాలను సత్వరమే అందజేయడం జరుగుతుందని మండల అధ్యక్షులు వీరభద్రుడు, జెడ్పీటీసీ లక్ష్మీదేవి, మండల కన్వీనర్ కుమార్‌రెడ్డిలు తెలియజేశారు. శనివారం మండలంలోని చింతలచెరువు, చిన్నవంగలి గ్రామ ఎంపిటిసి సభ్యురాలు ఎద్దుల రాజ్యలక్ష్మి, లక్ష్మిరెడ్డి, చిన్నవంగలి గ్రామ సర్పంచ్ మౌలిబాషాల అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తహసీల్దార్ సుభద్రమ్మ, ఎంపిడివో మహబూబ్ దౌలా, మండల విస్తరణ అధికారి సుదర్శన్‌రావుల పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సచివాలయాల పరిధిలో 449 కులధృవీకరణ పత్రాలు, 8 ఆదాయ పత్రాలు, 8 రీఎంట్రీ సర్టిఫికెట్లు, 15 రైస్‌కార్డులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో 448 వివిధ రకాల సేవాపత్రాలను ఎంపిపి వీరభద్రుడు, జెడ్పీటీసీ లక్ష్మీదేవిలు అందజేశారు. మరెవరికైనా సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలని వారు కోరడంతో పలువురు పింఛన్లు, సంక్షేమ పథకాలు అందలేదని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎంపిపి, మండల కన్వీనర్ మాట్లాడుతూ ఈ రెండు గ్రామాల సచివాలయాల పరిధిలో దాదాపు రూ.15కోట్లతో వివిధ సంక్షేమ పథకాలతోపాటు పింఛన్లు, రైతుభరోసా, అమ్మఒడి, వసతిదీవెన, నవరత్నాలతో సంక్షేమ పథకాలు అందించడం జరిగిందన్నారు. మరొకసారి ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డిని ఆశీర్వదించాలని వారు ప్రజలను కోరారు. తాలుకాలో అభివృద్ధి చేసిన ఘనత గంగుల కుటుంబానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రామగురివిరెడ్డి, బచ్చు సుబ్రహ్మణ్యం, గణపతిరెడ్డి, ఎద్దుల లక్ష్మిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, నరసింహారెడ్డి, రామకృష్ణారెడ్డి, వేణుగోపాల్‌యాదవ్, తహసీల్దార్ సుభద్రమ్మ, ఎంపిడివో మహబూబ్ దౌలా, డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్, ఏవో రంగనేతాజీ, పశువైద్యాధికారి సాయిబాబా, ఏఈలు కొండారెడ్డి, జగ్గయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, స్వప్న, వీఆర్వోలు శిఖామణి, వెంకట్రామిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## బేతంచెర్లలో ముమ్మరంగా ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియ

**బేతంచెర్ల, జూలై22, ప్రభాతవార్త:** రాష్ట్ర ఎల క్షన్ కమిషన్ ఆదేశాల మేరకు మండలంలో ఓటర్ లిస్ట్ వెరిఫికేషన్ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతుంది. ఇందులో భాగంగా బీఎల్‌వోలు శనివారం వారి వారి పరిధిలో ఇంటింటికి వెళ్లి ఓటర్ లిస్ట్ వెరిఫికేషన్ చేపట్టారు. ఆయా కుటుంబాల్లోని సభ్యుల సంఖ్య, ఓటర్లుగా నమోదైన వారి పేర్లను అడిగి తెలుసుకోవడంతోపాటు మరణించిన వారి వివరాలను సేకరించడం జరిగింది. బీఎల్‌వోలతోపాటు టీడీపీ బీఎల్ఏలు ఈ వెరిఫికేషన్ ప్రక్రియలో పాల్గొనడం జరిగింది. అయితే వలంటీర్లు వెరిఫికేషన్ ప్రక్రియలో పాల్గొంటే వివరాలను తెలియజేస్తే కర్నూలు కలెక్టర్ బీఎల్‌వో పై వేటు వేయడంతో పలు జాగ్రత్తలతో బీఎల్‌వోలు వెరిఫికేషన్ ప్రక్రియను నిర్వహించడం జరుగుతుంది.

## క్రీడా మైదానంలో భారీ వాహనాలు

**పాణ్యం, జూలై 22, ప్రభాతవార్తః** స్థానిక ప్రభుత్వ పాఠశాల అవరణలో బారీగా అడ్డంగా వాహనాలు నిలిపారు. రాయల్టీ అధికారులు పట్టుకున్న వాహనాలు అనుమతులు లేకుండా ప్రభుత్వ పాఠశాల అవరణలో పెట్టడం ద్వారా పిల్లలు అడుకోవడానికి వీలులేకుండా పోతుంది. ఎంతో చరిత్ర కలిగిన పాఠశాల మైదానం ఇప్పుడు ఆర్టీఏ అధికారులకు, రాయల్టీ అధికారులకు పాఠశాల మైదానాన్ని అడ్డాగా మార్చుకున్నారు. వీటి వల్ల రోజు మార్నింగ్ వాకింగ్ వచ్చే ప్రజలు, పిల్లలకు అంతారాయం ఏర్పడుతుంది. నెలలు గడుస్తున్నా బారీ కంటైనర్లు స్థానిక పాఠశాల మైదానంలో ఉండడం వల్ల అపరిశుభ్రవాతావరణంగా మారింది. ఇప్పటికైనా పోలీస్ అధికారులు, విద్యాశాఖ అధికారులు స్పందించి వాహనాలు తొలగించాలని విద్యార్థులు కోరుతున్నారు.

## 25న విద్యాసంస్థలు బంద్

**దేవనకొండ,జూలై 22,ప్రభాతవార్త :** వైసిపి ప్రభుత్వ విద్యార్థి వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 25న రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వడ్డే పెద్దయ్య,ఏఐఎస్‌ఎఫ్ దేవనకొండ మండల అధ్యక్షుడు మధు,టిఎన్‌ఎస్‌ఎఫ్ మండల అధ్యక్షులు బాలరంగడులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు,కార్పొరేట్ విద్యాసంస్థల్లో ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులు మాత్రమే వసూలు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనుమతిలేని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై అనుమతులు రద్దు చేయాలని జగనన్న విద్యా దీవెన,వసతి దీవెన బకాయిలు,అమ్మఒడి పథకం అర్హులైన వారికి తక్షణమే విడుదల చేయాలన్నారు. సంక్షేమ హాస్టల్స్‌ను ఆధునీకరించి మెరుగైన వసతి సౌకర్యాలను కల్పించాలన్నారు. అలాగే సంక్షేమ హాస్టల్స్‌కు సొంత భవనాలు సమకూర్చాలని,ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు. జీఓ నంబరు 77ను రద్దు చేసి చదువుకునే ప్రతి విద్యార్థికి ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యాన్ని కల్పించి మెగా డిఎస్‌సిని ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు భాస్కర్, సురేంద్ర,నరేష్,అశోక్,మధు,నరేంద్రబాబు,రామాంజనేయులు,టిఎన్‌ఎస్‌ఎఫ్ మండల ఉపాధ్యక్షుడు బాలు,తేజ తదితరులు పాల్గొన్నారు.

## పగడ్బందిగా ఓటర్ల సర్వే

**కోడుమూరు,జూలై 22, ప్రభాతవార్త :** కోడుమూరు మండలంలో ఆయా గ్రామాలలో పగడ్బందిగా ఓటర్ల సర్వేను నిర్వహిస్తున్నామని తాహశీల్దార్ జయ్యన్న తెలిపారు. శనివారం పట్టణంలో బిఎల్‌వోలు నిర్వహిస్తున్న ఓటర్ల సర్వే కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలో ఓటర్ల నమోదు,తొలగించడం,ఎమైన సమస్యలు ఉంటే వాటికి సంబంధించిన ఫారంలలో నమోదు చేసుకునే అవకాశాలు కల్పించామన్నారు. కొత్తగా ఓటర్ల నమోదుకు ఫారం 6, తొలగింపుకు 7,షిఫ్టుంగులకు 8లలో ధరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామంలో ఓటర్ల ప్రక్రియలో ఎవైన పొరపాట్లు, ఓటర్ల జాబితాలో మిస్సింగ్ అయిన వాటిపై పూర్తి స్థాయిలో విచారణ చేసి ఓటర్ల సమస్యలపై అక్కడికక్కడే పరిష్కారం చేసే దిశగా సర్వే పనులు చేపట్టామన్నారు. ఓటర్ చనిపోయిన వారి డెత్ సర్టిఫికెట్‌తో పాటు స్థానికుల విచారణ చేసిన తరువాతే ఆ ఓటర్‌ను తొలగించడం జరుగుతుందన్నారు. వీటికి ముందుగా తాము 13,14 కింద నోటీసులు జారీ చేస్తామని, అంతేగాక ఓటర్లు అడ్రస్సులు మారిన వాటిపై కూడా ప్రస్తుతం తాము చేపట్టుతున్న సర్వేలోనే వారి సమస్యలను పరిష్కరించుకోవాలనా ్నరు. కొత్తగా ఓటర్ల నమోదు చేసుకునే వారికి బిఎల్‌వోలకు తప్పని సరిగా ఆధార్ కార్డుతో ఫారం 6 లో ఓటర్ నమోదు చేసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇంకా ఎవైన సమస్యలు ఉంటే ఆయా పోలింగ్ బూత్‌లకు ఏర్పాటు చేసిన బిఎల్‌వోలను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఎల్‌వో జ్యోతి,విర్వోలు ఎల్లప్ప,నారాయణ,వి.ఆర్.ఎ కొండన్న తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసగా దిష్టిబొమ్మ దగ్ధం

**– భారతదేశంలో మహిళలకు రక్షణ కరువయ్యింది**

**ఆదోనిటౌన్, జూలై22, ప్రభాతవార్త ;** మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక ఘటనకు నిరసనగా శనివారం డీఎస్‌ఎఫ్ నాయకులు కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. బీజేపీ మతోన్మాద, అసమర్థపాలన వైఫల్యం, అల్లర్లు, మతహింస కారణంగా నష్టపోయిన మహిళలు, పిల్లలు, అందరికీ శాంతి సామరస్యంగా న్యాయం చేయాలని డీఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మతోన్మాదులు ఎదగడానికి, రక్షించడానికి అవకాశం కల్పించిన బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ విభజన రాజకీయాలను తీవ్రంగా తిరస్కరించాలన్నారు. మణిపూర్ సంక్షోభం నుంచి రాజకీయ ప్రయోజనం పొందేందుకు ప్రధాని నరేంద్రమోదీ, సీఎం బీరేన్‌సింగ్ చూస్తున్నారన్నారు. శాంతిభద్రతలను పరిరక్షించకుండా నిర్లక్ష్యం చేయడం ఏమిటని ప్రశ్నించారు.గత మూడు నెలల్లో వందల మంది మరణించారని, వేలాది మంది గాయపడ్డారన్నారు. బాధితులను ఆదుకుని, మహిళలకు రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ధణాపురం ఉదయ్, నాయకులు సురేష్, హరిక్రిష్ణ, గోపాల్, రాము, పవన్, నాగప్ప, శాంతప్ప పాల్గొన్నారు.

## 25న జరిగే విద్యాసంస్థలు బంద్‌ను జయప్రదం చేయాలి

**ఆలూరు,జూలై 22,ప్రభాతవార్త :** ఈ నెల 25న రాష్ట్రవ్యాప్తంగా జరిగే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని టిఎన్‌ఎస్‌ఎఫ్,ఏఐఎస్‌ఎఫ్,ఏఐవైఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని స్థానిక జూనియర్ కళాశాలలో ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా సమితి సభ్యులు మునిస్వామి,ఏఐఎస్‌ఎఫ్ దుర్గానాయక్,టిఎన్‌ఎస్‌ఎఫ్ తాలుక ప్రధాన కార్యదర్శి మనోహర్‌యాదవ్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సిఎం జగన్ విద్యారంగాన్ని భ్రష్టుపట్టించారని విమర్శించారు. నాడు పాదయాత్రలో అనేక మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన తర్వాత హామీల ఊసే ఎత్తడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బిసి,ఎస్‌సి,ఎస్‌టి,మైనార్టీ సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఘోరంగా విఫలమయ్యారన్నారు. ప్రైవేటు,కార్పొరేట్ విద్యాసంస్థల్లో ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులు మాత్రమే వసూలు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనుమతిలేని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై అనుమతులు రద్దు చేయాలన్నారు. రాష్ట్రంలో జీఓ 117ని తీసుకొచ్చి పాఠశాలల విలీన ప్రక్రియను ప్రారంభించారని విలీనంకాబడిన 3,4,5 తరగతుల విద్యార్థులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండ జీఓ 77ను తీసుకొచ్చి విద్యార్థుల యొక్క ఉన్నత విద్యకు ఇబ్బంది కలుగచేస్తున్నారన్నారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికై ఈ నెల 25న విద్యాసంస్థల బంద్‌ను నిర్వహిస్తున్నామని ఈ బంద్‌కు విద్యాసంస్థల యాజమాన్యాలు సహకరించాలన్నారు. ఏఐఎస్‌ఎఫ్,టిఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు సంతోష్,కళ్యాణ్,రాజశేఖర్, సుంకప్ప,మల్లికార్జున,అయ్యాజ్,వసంత్,జగదీష్,హరి,మురళీ,గోవిందు తదితరులు పాల్గొన్నారు.

## రాయలసీమ విశ్వవిద్యాలయంలో పరిశుభ్రతా-పచ్చదనం

**కర్నూలు విద్య, జూలై 22, ప్రభాతవార్త:** రాయలసీమ విశ్వవిద్యాలయం కర్నూలు స్వచ్ఛతా కార్యక్రమంలో భాగంగా విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ ఏ ఆనందరావు అదేశాల మేరకు, సైన్స్ మరియు ఆర్ట్స్ కళాశాల అధ్యక్షులు ప్రొఫెసర్ నాయక్, ప్రొఫెసర్ కృష్ణారెడ్డి వీరి ఇరువురి సంయుక్త అధ్వర్యంలో పరిశుభ్రతా పచ్చదనం కార్యక్రమాన్ని ఎన్ ఎస్ ఎస్ విభాగం నిర్వహించింది. విశ్వవిద్యాలయంలో విద్యార్థుల వసతి గృహం నందు వున్న అవరణలో చెత్తను తొలగించి పరిసర ప్రాంతంలోని కంపచెట్లను తీయించి శుభ్రపరిచారు. ఈస్వచ్ఛతా కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులతో పాటు బోధన, బోధనేతర సిబ్బంది ప్రొగ్రామ్ ఆఫీసర్లు అందరు కలసి కట్టుగా పరిసరాలు శుభ్రపరిచారు. ఇలాంటి స్వచ్ఛత కార్యక్రమాలు ఇక ముందు అన్ని బిల్డింగ్‌ల యందును విద్యార్థి వసతి గృహలయందును జరగాలని భావిస్తున్నట్లు తెలిపారు.

## ఆదోని జిల్లా కోర్టులో స్పెషల్ లోక్‌అదాలత్

**ఆదోనిలీగల్, జూలై22, ప్రభాతవార్త ;** ఆదోని జిల్లా కోర్టులో అదనపు జిల్లా జడ్జి ఆధ్వర్యంలో శనివారం జాతీయ స్పెషల్ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 2వ అదనపు జిల్లా జడ్జి పి.జె.సుధ మాట్లాడారు. కేసుల పరిష్కారానికి రాజీమార్గమే రాజమార్గమని పేర్కొన్నారు. వివిధ రకాల రోడ్డు ప్రమాదాల (వాహనాల యాక్సిడెంట్) కేసులు, ప్రభుత్వ భూసేకరణ కింద సేకరించిన వివిధ రకాల కేసులు పరిష్కారానికి నోచుకున్నాయన్నారు. భూసేకరణలో నష్టపోయిన రైతులకు ఈ స్పెషల్ లోక్‌అదాలత్ ఒక సువర్ణావకాశమని జడ్జి అన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు, అడ్వకేట్ ఆనంద్, ఏజీపీ యస్.అంజినప్ప , సీనియర్ అడ్వకేట్ గిరిధర్, డిప్యూటీ తహసీల్దార్ దీప, బార్ అసోసియేషన్ అధ్యక్షులు అనితాభాయి, జనరల్ సెక్రటరీ డా.హెచ్.అంజినప్ప, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## అసాంఘీక కార్యకలాపాలకు నంద్యాల అడ్డా

**–నంద్యాల్లో కేటుగాళ్లు కోకోళ్ళలు మోసగాళ్ళకు కట్టడి చేయని పోలీసులు**

**నంద్యాల క్రైం, జూలై 22, ప్రభాతవార్త:** నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయం నంద్యాలలో అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. కేటుగాళ్లు, ఘరాన మోసగాళ్ల చీటింగ్ వాళ్లు, దొంగతనాలు, దోపిడిలు అధిక సంఖ్యలో పాల్పడుతున్నారు.అక్రమాలకు పాల్పడుతున్న వారిన బారీనపడి ఎందరో బలిపశువుగా మారారు. ఏమారితే చట్టాన్ని కూడ లెక్కచేయకుండా నేరగాళ్లు వారి పని వారు గుటు ్టగా కొనసాగించుకుంటున్నారు. నంద్యాల్లో కేటుగాళ్ళ పాలన సాగిస్తున్నారు. ఇక ఘరాన మోసగాళ్లు విచ్చలవిడిగా అక్రమాలకు పాల్పడుతున్నారు. ఉద్యోగాల పేరుతో టోకరకు పాల్పడుతున్నారు. ఇంటికి తాళం వేస్తే ఖతం దొరికినకాడికి దోచుకుపోతున్నారు. దొంగతనాలపై పట్టణంలోని పోలీస్‌స్టేషన్లలో పలు కేసులు రికార్డుల్లో నమోదు అయ్యాయి. అఘాయిత్యాలు, ఆత్మహత్యలు, హత్యలు వివాహేతర సంబంధాలతో పచ్చని సంసారంలో చిచ్చుపెట్టింది. ఈసంఘటన వైయస్‌ఆర్‌నగర్‌లో కలకలం రేపింది. బలవన్మరణాలు, కోకోళ్ళలుగా జరిగాయి. తాజాగా నంద్యాల శివారు ప్రాంతంలోని రైతునగర్ వద్ద ఓ రియల్‌ఎస్టేట్ వ్యాపారి గోపిరెడ్డి మధన్‌మోహన్‌రెడ్డి బురిడి కొట్టించి రూ.2.5 కోట్లను దోచుకెళ్లిన మూఠా. రెండు వేల నోట్లు ఉన్నాయని వాటిని మార్చి ఇస్తే అదనంగా డబ్బు ఇస్తామని చెప్పి తీరా 500 నోట్ల కట్టలు రూ.2.5 కోట్లు తీసుకున్నాక పక్కా ప్లాన్‌తో పోలీస్ సైరన్‌తో నకిలీ ముఠా డబ్బుతో పరార్ అయ్యారు. ఫేక్ పోలీస్ సైరన్‌తో రూ.2.5 కోట్లు దోచుకెళ్లిన మూఠా సభ్యులు. పట్టణానికి చెందిన సాయిబాబానగర్‌లో నివాసం ఉంటున్న కేటుగాడు అన్వర్ అనే వ్యక్తి 13 కార్లను బాడుగలకు తీసుకొని ఇతరులకు కుదువపెడుతున్న సంఘటన పట్టణంలో సంచలం రేపింది. ఇలా రకరకాలుగా నంద్యాల పట్టణంలో అసాంఘీక కార్యకలాపాలు వైరల్ అవుతున్నాయి. ఈసంఘటనలపై పోలీసులు దృష్టిసారించి కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు వాపోతున్నారు.

## జగనన్న సురక్షతో ప్రజల వద్దకే పాలన

**ఆస్పరి,జూలై 22,ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకంతో పేదప్రజల వద్దకే పాలన అందిస్తున్నారని ఎంపిపి సుంకర ఉమాదేవి,తహశీల్దార్ కుమారస్వామి,ఎంపిడిఓ రాణెమ్మలు అన్నారు. శనివారం మండల పరిధిలోని శంకరబండ,తంగరడోన గ్రామ సచివాలయాల్లో సర్పంచ్‌లు విజయలక్ష్మి,శంకరమ్మల అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులై ఉండి ఏ ఒక్కరు లబ్ది అందకుండ మిగిలిపోకూడదన్న ఉద్దేశ్యంతో ప్రతి ఇంట్లో ఏ సమస్య ఉన్నా దానిని పరిష్కరించాలనే ఉద్దేశ్యంతోనే జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టామన్నారు. సామాన్య పేద ప్రజలకు రూపాయి ఖర్చు లేకుండ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అన్ని అర్హతలు ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారికి జగనన్న సురక్ష ఓ వరంలాంటిందన్నారు. రాష్ట్రంలో శాచ్య రేషన్ పద్ధతిలో అర్హులైన ప్రతిఒక్కరికి మంచి చేసిన జగనన్న ప్రభుత్వంగా మిగిలిపోతుందన్నారు. ప్రతి పథకం అందరికి అందాలన్న లక్ష్యంతోనే జగనన్న సురక్ష ప్రవేశపెట్టి ఇంటింటిని జల్లెడ వేసి లబ్ది చేకూరుస్తున్నారన్నారు. అనంతరం అర్హులైన వారికి సర్టిఫికేట్లను మంజూరు చేశారు. జగనన్న సురక్షలో భాగంగా శంకరబండలో 150,తంగరడోనలో 350మంది లబ్దిదారులకు ధృవపత్రాలను ఎలాంటి సర్వీసు ఫీజులు లేకుండ ఉచితంగా అందచేశామన్నారు. ఈ కార్యక్రమంలో చిరుమాన్‌దొడ్డి సర్పంచ్ సుంకర నాగమ్మ,వైసిపి మండల కన్వీనర్ పెద్దయ్య ,జెసిఎస్ కన్వీనర్ బసవరాజు,వైసిపి మండల కోకన్వీనర్ పురుషోత్తంరెడ్డి,సీనియర్ నాయకులు పులికొండ రంగన్న,సచివాలయ కన్వీనర్ రాజన్న, నాయకులు తిమ్మప్ప,శేఖర్, నాగభూషణం,మునిస్వామి,దస్తగిరి, రంగముని,ఈఓఆర్‌డి సూర్యనరసింహారెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ గాయత్రి,పంచాయతీ కార్యదర్శులు లక్ష్మన్న,వీరేష్,విఆర్‌ఓలు వాణిశ్రీ,సచివాలయ సిబ్బంది,వాలంటరీలు,ప్రజలు పాల్గొన్నారు.

## 28న జూనియర్ కళాశాలల బంద్ విజయవంతం చేయాలి

**నందికొట్కూరు,జూలై 22,ప్రభాతవార్త:** జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికై ఈ నెల 28న జరిగే రాష్ట్ర వ్యాప్త జూనియర్ కళాశాలల బంద్‌ను జయప్రదం చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నాయకులు కళామంచ్ జిల్లా కన్వీనర్ నాగరాజు, భానుప్రకాష్ పిలుపు నిచ్చారు. శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం ఉన్న విద్యారంగ సమస్యలు గాలికి వదిలేసి ప్రభుత్వ కళాశాలలో కనీసం విద్యార్థులకు పుస్తకాలు ఇవ్వకుండా వారి భవిషత్తును నాశనం చేస్తున్నారని, ఇప్పటికైన ప్రభుత్వం కళాశాలలో నెలకొన్న మౌళిక వసతులు కల్పించాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న2 వేల లెక్చరర్ల పోష్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రతి మండలానికి ఒక జూనియర్ కళాశాల ఏర్పాటు, ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఫీజుల దోపిడిని అరికట్టాలి, మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలి, నీట్, జేఈఈ పేర్లతో జరుగుతున్న కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎబివిపి నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ జిల్లా జాయింట్ సెక్రటరీగా అమానుల్లా నియామకం

**హొళగుంద,జూలై 22,ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ జిల్లా జాయింట్ సెక్రటరీగా ఎం అమానుల్లా నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం నియామక పత్రాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎం సుధాకర్ బాబు చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను జిల్లా జాయింట్ సెక్రటరీగా నియమించినందుకు కాంగ్రెస్ అధ్యక్షులు సుధాకర్‌బాబు,జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యానారాయణగుప్త,మైనార్టీ సెల్ చైర్మన్ ఖాజాహుస్సేన్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. హొళగుంద మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎల్లప్పుడు రుణపడి ఉంటానని 2024ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో,కేంద్రంలో పూర్వవైభవం తెస్తామని ధీమా వ్యక్తం చేశారు. 2024ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచి రాహుల్‌గాంధీ ప్రధాని అవ్వడం ఖాయమని జోస్యం చెప్పారు.

## ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

**సుంకేశ్వరి(మంత్రాలయం),జూలై 22,ప్రభాతవార్త:** మండలంలోని 18 సం.లు దాటిన యువకులందరూ ఓటర్లుగా నమోదు చేయించుకోవాలని తహశిల్దార్‌చంద్రశేఖర్ అన్నారు.శనివారం మండల పరిధిలోని సుంకేశ్వరి గ్రామంలో బిఎల్‌ఓలు నిర్వహిస్తున్న ఇంటింటికీ ఓటరు నమోదును పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాటా ్లడుతూ ప్రభుత్వం నెల రోజులపాటు ఓటర్ల వెరిఫికేషన్,నూతన ఓటర్ల నమోదు,లేనివారిని ఓటర్లుగా తొలగించడం తదితర సేవలు చేస్తున్నట్లు తెలిపారు.కాబట్టి ఆయా గ్రామాల్లోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.వీరివెంట ఆర్‌ఐ ఆనంద్,సర్వేయర్ తిమ్మేష్ తదితరులు ఉన్నారు.

## మొహరం వేడుకలకు అనుమతి తప్పనిసరిగా

**హాలహర్వి,జూలై 22,ప్రభాతవార్త :** మండలంలో జరిగే మొహరం వేడుకలకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్‌ఐ నాగేంద్ర అన్నారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మొహరం వేడుకలు నిర్వహించే నిర్వాహకులు మీసేవాలో చలానా చెల్లించి అనుమతి పొందాలన్నారు. అలాగే మొహరం వేడుకలను దృష్టిలో ఉంచుకుని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా సారించామని ఆయన తెలిపారు. మొహరం వేడుకల్లో ఎవరైనా అల్లర్లు సృష్టించినా,అసాంఘిక కార్యకలాపాలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొహరం వేడుకల్లో నాటుసారా,కర్ణాటక మద్యం విక్రయిస్తే అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వేడుకలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో ఇరువర్గాల వారికి కౌన్సిలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. అలాగే బైండోవర్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ ఇంద్రుడు,పోలీసులు గోవర్ధన్,అయ్యస్వామి,అశోక్ తదితరులు పాల్గొనా ్నరు.

## మణిపూర్ ఘటన భారతదేశానికే సిగ్గుచేటు

**ఆదోనిలీగల్, జూలై22, ప్రభాతవార్త ;** ఇటీవల మణిపూర్‌లో జరిగిన స్త్రీల సంఘటన యావత్ భారత దేశానికే తలదించుకునేలా ఉందని, సిగ్గుచేటని అంబేడ్కర్ ఆలోచన ఫౌండేషన్ (ఏఏఎఫ్) కన్వీనర్ శేషంప్రభాకర్ అన్నారు. శనివారం ఏఏఎఫ్ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో సమావేశం నిర్వహించి మణిపూర్ ఘటనను తీవ్రంగా ఖండించారు. పట్టపగలే నడిరోడ్డుపై స్త్రీలను నగ్నంగా ఊరేగించడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి ఘటనకు కారకులైన వారిని చట్టరీత్యా కఠినంగా శిక్ష విధించి ఉరితీయాలన్నారు. మణిపూర్ ప్రభుత్వం, పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడంతోనే ఇలాంటి సంఘటన జరిగిందన్నారు. అదే మణిపూర్‌లో 357 చర్చ్‌లను ధ్వంసం చేసి, ఫాస్టర్‌లను 150 మందిని తరిమికొట్టడం దారుణమన్నారు. కేవలం క్రిష్టియన్లనే అక్కడ ప్రభుత్వం టార్గెట్ చేసి ఇలాంటి ఘటనలకు పాల్పడడం బాధాకరమని బార్ అసోసియేషన్ నాయకులు, సీనియర్ న్యాయవాది డా.హెచ్.అంజినప్ప, ఏజీపీ ఎస్.అంజినప్పలు అన్నారు.

## సాగుకు సహాయం ఎకరాకు రూ.10వేలు ఇవ్వాల్సిందే..

**పత్తికొండ,జూలై 22,ప్రభాతవార్త :** సాగు సహాయం ఎకరాకు రూ.10వేలు ఇవ్వాల్సిందేనని ఏపి రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు పి రామచంద్రయ్య డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో ఏపి రైతుసంఘం నియోజకవర్గ కార్యదర్శి పెద్ద ఈరన్న అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఐ,సిపిఎం,తెదేపా,కాంగ్రెస్,లోక్‌సత్తా, జనసేన పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపి రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రయ్య,జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బత్తిన వెంకటరాముడు,తెదేపా రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మనోహర్ చౌదరి,లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు ఆనందాచారిలు మాట్లాడుతూ డాక్టర్ స్వామినాథన్ కమీషన్ సిఫారసులను అమలు చేయాలని,దేశానికి అన్నవస్త్రాలను అందించే అన్నదాత రైతన్నలకు రూ.2లక్షల వరకు బ్యాంకు రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలన్నర పూర్తి కావస్తున్నా ఇంతవరకు వర్షం జాడ లేదని,రైతులు పంటలు సాగు చేసుకునేందుకు తెలంగాణ రాష్ట్రం తరహాలో మన రాష్ట్రంలో కూడా ఎకరాకు రూ.10వేలు ఇవ్వాలని,రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు గ్యారెంటీ యాక్ట్ చట్టం తీసుకురావాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 50శాతం నిధులను వ్యవసాయ రంగానికి కేటాయించారన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు తక్షణమే నిధులు కేటాయించి త్వరితగతిన పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నబీరసూల్,కారుమంచి,తెదేపా నాయకులు రామానాయుడు,సిపిఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు,సిపిఐ జిల్లా సమితి సభ్యులు గురుదాస్, తిమ్మయ్య,ఏపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాజాసాహెబ్,నియోజకవర్గ అధ్యక్షులు కారన్న,జనసేన నాయకులు రాజశేఖర్, సిపిఎం నాయకులు దస్తగిరి,కాంగ్రెస్ నాయకులు నాగార్జున,సిపిఐ,ప్రజాసంఘాల నాయకులు నెట్టికంటయ్య,పెద్దయ్య,మాదన్న తదితరులు పాల్గొన్నారు.

## గూటుపల్లెలో అనాధ మృతదేహానికి అంత్యక్రియలు

**బేతంచెర్ల,జూలై22,ప్రభాతవార్త:** మండల పరిధిలోని గూటుపల్లెలో అనాధగా జీవిస్తున్న సుమారు 50 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి శనివారం మృతి చెందడంతో ఆ నలుగురు స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు వన్నూరు బాషా,సభ్యులు కలిసి అంత్యక్రియలు నిర్వహించారు.గ్రామంలో నివసిస్తున్న అతడికి తనవరంటూ ఎవరు లేకపోవడంతో గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో పోలీసులకు సమాచారం ఇచ్చి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సేవా సంస్థ సభ్యులు నాగేశ్వరరెడ్డి,రాఘవేంద్ర,యూసుబ్,ప్రతాప్,అక్బర్,మాబాషా,గూటుపల్లె మున్నా తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు రెండో వారంలో విశ్వరూప మహాసభ..

**కోసిగి, జూలై 22, ప్రభాతవార్త :** ఆగస్టు రెండో వారంలో హైదరాబాదులో విశ్వరూప మహాసభ నిర్వహిస్తున్నట్లు ఎంఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు, జిల్లా ఇంచార్జీ డాక్టర్ వైకె.విశ్వనాథ్ తెలిపారు.. శనివారం కోసిగిలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ నందు ఎంఎస్పీ మండల కన్వీనర్ చింతకుంట సామేల్ అధ్యక్షతన ఎంఎస్పీ సమావేశం జరిగింది.. ఈ కార్యక్రమానికి ఎంఆర్‌పిఎస్ జిల్లా కన్వీనర్ ఆశపోగు పరమేష్, రెడ్డిపోగు భాస్కర్, జిల్లా కోకన్వీనర్ దుర్గప్పలు హాజరయ్యారు.. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు విశ్వనాథ్ మాట్లాడుతూ ఎంఆర్‌పియస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.. ఏబిసిడి వర్గీకరణపై చేవడుతున్న విశ్వరూపం మహాజన సభను కర్నూలు జిల్లా నుంచి, మంత్రాలయం నియోజకవర్గం నుంచి, ముఖ్యంగా కోసిగి నుండి ప్రతి మాదిగలు ఇళ్లకు తాళాలు వేసి రావాలన్నారు.. ఎన్నో ఏళ్ల మాదిగ కల నేరవేరే సమయం వచ్చిందని, ప్రతి గ్రామంలోని వారందరు ఆగస్టు రెండో వారంలో హైదరాబాద్ నగరంలో జరిగే మాదిగల విశ్వరూప మహాసభలో పాల్గొన్ని విజయవంతం చేసి మాదిగల సత్తను చూపించాలని కోరారు..అనంతరం రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం చేసారు..ఈ కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ మైఖేల్ విజయ్‌కుమార్, తాలూకా కన్వీనర్ నాగరాజు ఎంఆర్‌పియస్ సీనియర్ నాయకులు బొగ్గుల తిక్కన్న, జంబన్న, కోసిగి మండల ఎంఆర్‌పియస్ కన్వీనర్ మొంది నరసింహులు, ప్రకాష్, కోడి ఉరుకుందప్ప, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు..

## 25న విద్యారంగ సమస్యల పరిష్కారానికై విద్యాసంస్థలు బంద్

**హొళగుంద,జూలై 22,ప్రభాతవార్త :** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఈ నెల 25న రాష్ట్రవ్యాప్తంగా జరిగే విద్యాసంస్థల బంద్‌ను నిర్వహిస్తున్నామని ఈ బంద్‌ను జయప్రదం చేయాలని టిఎన్‌ఎస్‌ఎఫ్ మండల కార్యదర్శి మల్లికార్జున, ఏఐఎస్‌ఎఫ్ మండల కార్యదర్శి సతీష్‌కుమార్‌లు పిలుపునిచ్చారు. శనివారం ఏఐఎస్‌ఎఫ్,టిఎన్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 18న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల ఎదుట పెద్దఎత్తున మహాధర్నా కార్యక్రమాలు నిర్వహించామని, ఏఐఎస్‌ఎఫ్ నాయకుల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉన్న సాంఘీక సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం,మౌలిక సదుపాయలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా మెస్,కాస్మోటిక్ చార్జీలను పెంచాలన్నారు. సిఎం జగన్ నాడు పాదయాత్రలో అనేక మాయమాటలు చెప్పి గద్దెనెక్కారని ఆ తర్వాత హామీల ఊసే ఎత్తడం లేదన్నారు. ఇంటర్ విద్యార్థులకు గతంలో ప్రభుత్వం ఉచితంగా మెటీరియల్స్ ఇచ్చేవారని కానీ ఈ విద్యాసంవత్సరం నుండి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వకుండ విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఖాళీగా ఉన్న 53వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జీఓ 77ను తీసుకొచ్చి విద్యార్థుల యొక్క ఉన్నత విద్యకు ఇబ్బంది కలుగచేస్తున్నారన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఈ నెల 25న బంద్‌ను జయప్రదం చేయాలని విద్యాసంస్థ యాజమాన్యాలు,తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌ఎస్‌ఎఫ్ మండల ఉపాధ్యక్షులు సురేష్‌శెట్టి,ఏఐఎస్‌ఎఫ్,టిఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు దిడ్డి తిక్కస్వామి,సామిల్ హనుమంతు,రాము, మాంతేష్,హేమంతు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నాటుసారా స్వాధీనం

**ఆదోని రూరల్,జూలై 22,ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఇస్వి గ్రామంలో నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఇస్వి ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. శనివారం స్థానిక ఇస్వి పోలీస్‌స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్వి గ్రామ వెలుపల ఉన్న జమ్ము ఈరన్న పొలం పక్కన ఉన్న రస్తా వద్ద ఆదోని పట్టణం వాల్మీకి నగర్‌కు చెందిన బోయ మద్దిలేటి,బోయ మల్లికార్జునలు స్కూటీపై నాటుసారా తీసుకొస్తుండగా పోలీసులను చూసి నాటుసారా,స్కూటీని వదిలి పరారైనట్లు తెలిపారు. దీంతో 70లీటర్ల నాటుసారా,స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రామయ్య,అశోక్,సుధాకర్‌లు పాల్గొన్నారు.

## జగనన సురక్షను ప్రజలు వినియోగించెకోవాలి

**మాలపల్లి(మంత్రాలయం),జూలై 14,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని వైసిపి మండల కన్వీనర్ గుర్రెడ్డి భీంరెడ్డి అన్నారు.శనివారం మండల పరిధిలోని మాలపల్లి,సుంకేశ్వరి గ్రామాల్లో నిర్వహించిన జగనన ్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పదకొండు రకాల సేవలను ఈ కార్యక్రమంలో ఉచితంగా పొందవచ్చని తెలిపారు.గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే తమదృష్టికి తీసుకురావాలన్నారు.ఎంఎల్‌ఏ వై.బాలనాగిరెడ్డితో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని తెలియజేశారు.అనంతరం దృవపత్రాలను ప్రజలకు అందజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు సీతారామిరెడ్డి,మధుసుదన్‌రెడ్డి,ముక్కరన్న,మాజీ ఎంపిటిసి రఘునాథ్‌రెడ్డి,తహశిల్దార్ చంద్రశేఖర్ ,రాఘవేంద్రాచారి,ఎంపిడిఓ మణిమంజరి,పిఆర్‌ఏఈ నరసింహులు,ఏఈఓ నరసింహుడు,తదితరులు పాల్గొన్నారు.

## మణిపూర్ ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలి

**ఆలూరు,జూలై 22,ప్రభాతవార్త :** మణిపూర్ ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని మహిళా సంఘం ఐద్వా మండల కార్యదర్శి శేకన్‌బీ అన్నారు. శనివారం ఎస్‌ఎఫ్‌ఐ,డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మహిళా సంఘం మండల కార్యదర్శి శేకన్‌బీ మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో కుకి తెగకు చెందిన ముగ్గురు మహిళలను బహిరంగ ప్రదేశాలలో నగ్నంగా ఊరేగించి వారిని సామూహిక అత్యాచారం చేసిన మృగాలపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఘర్షణ వాతావరణం నిలువరించి శాంతిని నెలకొల్పాలన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మూడు నెలల నుండి మణిపూర్ రాష్ట్రంలో మైతి మరియు కుకి జాతుల మధ్య ఘర్షణ జరుగుతున్నదని ఆ ఘర్షణలను నిలువరించడంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ఘర్షణలు తమ రాజకీయాల కోసం ఉపయోగించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మణిపూర్ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరన్ సింగ్,ప్రధాని మోడీ తక్షణమే తమ పదవులకు రాజీనామా చేసి కుకీ జాతి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి,డివైఎఫ్ఐ మండల ఉపాధ్యక్షుడు గోవర్ధన్,వినోద్,ఉమేష్ తదితరులున్నారు.

## జగనన్న సురక్ష ప్రజలకు ఓ వరం లాంటిది

**నందికొట్కూరు,జూలై 22,ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసం చేపట్టిన జగనన్న సురక్ష ఓ వరం లాంటిదని బిజినవేముల గ్రామ సర్పంచ్ రవియాదవ్ తెలిపారు. శనివారం బిజినవేములలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతు రాష్ట్రంలో ప్రజలు సంక్షేమ పథకాలు పొందేందుకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వారికి కావలసిన 11 సర్టిఫికెట్లను ఎలాంటి సర్వీస్ చార్జీలు లేకుండా ఉచితంగా మీ వద్దకే అధికారులు వచ్చి ఇవ్వడం హర్షణీయమని, దీంతో అర్హులైన ప్రతి ఒక్కరు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు వీలు అవుతందన్నారు. గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టామని బిజినవేముల గ్రామానికి మూడవ స్థానం లభించిందన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా మన సి.ఎం. రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాడని వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆయనకు అండగా నిలవాలన్నారు. అనంతరం అర్హులైన వారికి సర్టిఫికెట్లను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో యం.పి.డి.ఓ.శోభారాణి, తహసిల్దార్ రాజశేఖర్‌బాబు, డిప్యూటి తహసిల్దార్ సత్యనారాయణ, పంచాయితీ కార్యదర్శి రవీంద్రా, సచివాలయ సిబ్బంది, వాలెంటీర్లు, స్థానికులు పాల్గొన్నారు.

## జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేయాలి

**ఆదోని రూరల్,జూలై 22,ప్రభాతవార్త :** జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేయాలని సిపిఎం మండల కార్యదర్శి కె లింగన్న,మండల కార్యవర్గ సభ్యులు వీరారెడ్డిలు అన్నారు. శనివారం ఈ నెల 26వ తేదీ నుండి 31వరకు సిపిఎం పార్టీ చేపట్టిన మహా పాదయాత్రను జయప్రదం చేయాలని కోరుతూ మూడోరోజు మండలంలోని పెద్దతుంబళం,కుప్పగల్,బల్లేకల్,గణేకల్,పాండవగల్లు,జాలమంచి,దొడ్డనకేరి, కొత్తూరు,మంత్రికి,పెసలబండ,సుల్తానపురం,కపటి,నాగలాపురం గ్రామాల్లో జీపుజాత కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని,పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని స్థానికంగా గ్రామాల్లో ఉన్న మౌలిక సదుపాయాలు మరియు రోడ్లు,స్మశానవాటిక తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డి రామాంజనేయులు,శాఖ కార్యదర్శి పాండురంగ,పార్టీ సభ్యులు నరసరెడ్డి,తాయన్న,హనుమంత్‌రెడ్డి,స్థానిక నాయకులు దొడ్డనకేరి కమల్‌నాథ్,ఈరన్న,కొత్తూరు రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## గడప గడప మన ప్రభుత్వం

**తుగ్గలి,జూలై 22,ప్రభాతవార్త :** మండల పరిధిలోని బొందిమడుగుల సచివాలయం పరిధిలోని గ్రామాల్లో 24,25వ తేదీ వరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షులు జిట్టా నాగేష్, సచివాలయ మండల కన్వీనర్ హనుమంతులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ పాల్గొంటారన్నారు. 24న సోమవారం సాయంత్రం 3గంటలకు లింగనేందొడ్డి,బొందిమడుగుల,25న మంగళవారం సాయంత్రం 3గంటలకు బొందిమడుగుల,26న బుధవారం సాయంత్రం 3గంటలకు నునసరాళ్ల,నల్లగుండ్ల గ్రామాల్లో 3రోజుల పాటు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున మండలంలోని వైసిపి నాయకులు,కార్యకర్తలు,సచివాలయ కన్వీనర్లు,గృహసారథులు,ప్రజా ప్రతినిధులు, ఆయా శాఖల ఉద్యోగులు హాజరు కావాలని కోరారు.

## పేదప్రజల సంక్షేమమే వైసిపి ధ్యేయం

**:-వైసిపి మండల కన్వీనర్ రాంమోహన్‌రెడ్డి**

**పెద్దకడబూరు,జూలై 22,ప్రభాతవార్త:** రాష్ట్రంలోని పేదప్రజల సంక్షేమమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని వైసిపి మండల కన్వీనర్ రాంమోహన్‌రెడ్డి అన్నారు.శనివారం మండల కేంద్రమైన పెద్దకడబూరులో సచివాలయం-1 నందు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ధరఖాస్తు చేసుకున్న వారికి ఉచితంగా వివిధ రకాల సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.అనంతరం గ్రామ వాలంటీర్లను సన్మానించారు.ఆయన మాట్లాడుతూ వాలంటరీ వ్యవస్థ ద్వారా ప్రజలకు వేగంగా సంక్షేమ పథకాలు అందుతాయన్నారు.టిడిపి హయాంలో సర్టిఫికెట్ల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరిగేవారన్నారు.సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జగనన్న సురక్ష ద్వారా ఇళ్ళవద్దకే సర్టిఫికెట్లను అందించడం జరుగుతుందన్నారు.గత 20 రోజులుగా మండలంలోని వివిధ గ్రామాల్లో వేలసంఖ్యలో సర్టిఫికెట్లను పంపిణీ చేశామన్నారు.ఈ కార్యక్రమంలో రోడ్డు డెవలప్‌మెంట్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపిడిఓ శ్రీనివాసులు,తహశిల్దార్ వీరేంద్రగౌడ్,గ్రామ సర్పంచ్ రామాంజినేయులు సచివాలయ సిబ్బంది,వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష ద్వారా సమస్యలు పరిష్కారం

**దేవనకొండ,జూలై 22,ప్రభాతవార్త :** గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పరిష్కారం అవుతాయని ఎంపిడిఓ గౌరీదేవి,డిప్యూటీ తహశీల్దార్ సుదర్శనం, గ్రామ సర్పంచ్ అరుణ్‌కుమార్,ఎంపిపి భర్త లుముంబా,పంచాయతీ కార్యదర్శి రాముడులు అన్నారు. శనివారం మండల పరిధిలోని తెర్నేకల్ గ్రామ పంచాయతీ నందు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అర్హత కలిగిన వారికి వివిధ రకాల ధృవీకరణ పత్రాలను 810మంది లబ్ధిదారులకు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న సురక్ష ప్రజలకురక్ష అని కావున ప్రతిఒక్కరు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భర్త కనుక వీరన్న,ఎంపిటిసి నామాల శ్రీనివాసులు,సచివాలయ కన్వీనర్లు రాజు,నారాయణ,జింక రాజు,బాటమీద లక్ష్మీ,రాఘవేంద్ర,సచివాలయ సిబ్బంది,వాలంటరీలు పాల్గొన్నారు.

## ఇంటర్‌లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానం

**:- డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి**

**ఆలూరు,జూలై 22,ప్రభాతవార్త :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాలలో మార్చిలో 10వ తరగతి ఉత్తీర్ణత అయిన విద్యార్థులు ఇంటర్‌లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 46సీట్లు(ఎస్‌సి) ఖాళీగా ఉన్నాయన్నారు. పదవ తరగతి రెగ్యులర్‌గా పాసైన విద్యార్థులకు అవకాశం ఉందన్నారు. ఎవరైనా పదవ తరగతి ఉత్తీర్ణత అయిన విద్యార్థులు ఆగస్టు 17వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

## దేశంలో మహిళలకు రక్షణ కరువైంది

**ఆదోని రూరల్,జూలై 22,ప్రభాతవార్త :** భారతదేశంలో మహిళలకు రక్షణ కరువైందని డిఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు మల్లికార్జున,జిల్లా నాయకులు రాజులు అన్నారు. శనివారం స్థానిక ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు మీద డిఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో మణిపూర్ సిఎం ఎన్ బీరెన్ సింగ్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్‌లో బిజెపి మతోన్మాద మరియు అసమర్థపాలన వైఫల్యం మరియు అల్లర్లు ముఖదాడులు మతహింస కారణంగా నష్టపోయిన మహిళలు,పిల్లలు ప్రతిఒక్కరికి శాంతి సామరస్యం మరియు న్యాయం పునరుద్ధరిం చాలన్నారు. రాష్ట్రంలో మతోన్మాద ముఖాలను ఎదగడానికి మరియు రక్షించడానికి అవకాశం కల్పించిన బిజెపి,ఆర్‌ఎస్‌ఎస్ విభజన రాజకీయాలను తీవ్రంగా తిరస్కరించడం చాలా అవసరమన్నారు. మణిపూర్ సంక్షోభం నుండి రాజకీయ ప్రయోజనం పొందేందుకు నరేంద్రమోడీ సిఎం ఎన్ బీరెన్ సింగ్ మరియు బిజెపి కప్పిపుచ్చడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. 2నెలలకు పైగా ఇంటర్‌నెట్‌ను మూసి వేయడం ద్వారా ప్రజలపై జరుగుతున్న అఘాయిత్యాలను సిగ్గుపడేలా చేయడానికి ప్రయత్నించారన్నారు. గత మూడు నెలల్లో వందలమంది మరణ ంచారన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ధణాపురం ఉదయ్,నాయ కులు సురేష్,హరికృష్ణ,గోపాల్, రాము,పవన్,నాగప్ప,శాంతప్ప పాల్గొన్నారు.


**డాక్యుమెంటు పోయినది**

నూర్ అహ్మద్ S/o Late అలంపూర్ అబ్దుల్ రషీద్ అను నేను నా ద్వారా ఇచ్చిన పత్రికా ప్రకటన విమనగా పొలానికి సంబంధించిన డాక్యుమెంట్ పోయినది. సర్వే నెంబరు 867 లో విస్తీర్ణం 3 ఎకరములు, డాక్యుమెంట్ నెంబరు 1576/2012 రిజిస్టర్ అయిన తేదీ 17-5-2012 కావున ఈ డాక్యుమెంటు దొరికిన వారు ఈ క్రింది చిరునామాకు సంప్రదించవలసినదిగా విన్నపం.

**చిరునామా :**

నూర్ అహ్మద్ S/o Late అలంపూర్ అబ్దుల్ రషీద్ H.No.4-62, కురువ పేట, తలముడిపి (V), మిడుతూరు (M), నంద్యాల (D). Pin.518508 Cell.No.9885227061.

